ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

5

శనివారం 8 ఫిబ్రవరి 2025





కలెక్టర్‌కు నామినేషన్ పత్రం అందజేస్తున్న పట్టభద్రులు ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మంత్రులు మనోహర్, పార్థసారథి, బీజేపీ ఎమ్మెల్యే కామినేని, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

అట్టహాసంగా ఆలపాటి నామినేషన్

8

- జనసంద్రంగా గుంటూరు నగరం
- మూడు పార్టీల నేతలతో ప్రదర్శనగా కలెక్టరేట్‌కు
- సంఘీభావంగా ఉమ్మడి కృష్ణాజిల్లా నేతలు

టీడీఆర్ అవినీతి.. రూ.10 కోట్లు


- రాష్ట్ర ప్రభుత్వానికి విజిలెన్స్ నివేదిక
- అక్రమాల్లో 10 మంది టౌన్‌ప్లానింగ్ అధికారుల పాత్ర
- డోర్ నెంబర్లు మార్చి అధిక విలువతో బాండ్లు జారీ
- గుంటూరు, మంగళగిరి, చిలకలూరిపేట, చీరాలలో అక్రమాల గుర్తింపు
- వైసీపీ హయాంలో నేతల మాటలకు పెద్దపీట వేసి ఖజానాకు గండి

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

రోడ్ల విస్తరణ జరగలేదు.. కానీ ఇల్లు, స్థలాలు కోల్పోయిన వారికి జారీచేసే టీడీఆర్ బాండ్స్ వ్యవహారంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో భారీ అవినీతి, అక్రమాలు జరిగాయి. నగర పాలక సంస్థ, పురపాలక సంఘాల్లో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గత వైసీపీ ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించిన నేతల మాటలకు పెద్దపీట వేసిన అధికారులు ప్రభు త్వ ఖజానాకు భారీగా గండి కొట్టారు. ఈ విషయాన్ని విజిలెన్స్ నిర్ధారించి రాష్ట్ర ప్రభుత్వానికి నివే దిక ఇచ్చింది. మూడు జిల్లాల పరి ధిలో రెండు మున్సిపల్ కార్పొ రేషన్లు, 10 మున్సిపాలిటీల్లో రూ.10 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్లు తేల్చింది. గడచిన ఐదేళ్ల కాలంలో కొందరు టౌన్ ప్లానింగ్ అధికారులు నిబంధనలకు పూర్తిగా నీళ్లొదిలి ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొట్టినట్లు తేల్చారు. రోడ్డు అభివృద్ధి ప్రణాళిక (ఆర్‌డీపీ) లేకుండానే టీడీఆర్ బాండ్లు జారీ చేసినట్లు విచారణలో తేలింది. ఈ వ్యవహారంలో 10 మంది టౌన్ ప్లానింగ్ అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. వారికి ఇప్పటికే విజిలెన్స్ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయితే గడువు ముగిసినా ఆ అధికారులు విచారణకు హాజరు కాలేదని సమాచారం.

ఒక్కోచోట ఒక్కోలా..

గుంటూరు, మంగళగిరి-తాడేపల్లి కార్పొ రేషన్లతో పాటు, 10 మున్సిపాలిటీలలో మొత్తం 750 టీడీఆర్ బాండ్లు జారీ అయ్యాయి. వాటిని జారీ చేసేందుకు టౌన్ ప్లానింగ్ అధి కారులు ఒక్కో చోట ఒక్కో విధానాన్ని అమలు చేశారు. 2020 అక్టోబరు 1న టీడీర్ బాండ్లు జారీ సమయంలో రోడ్డు అభివృద్ధి ప్రణాళికను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం జీవో జారీ చేసింది. గుంటూరు, చీరాల, చిలకలూ రిపేటల్లో ఈ జీవోను పూర్తిగా పక్కన పెట్టి బాండ్లు జారీచేశారు. మార్కెట్ విలువ తక్కువగా ఉన్న చోట ఎక్కువగా ఉన్నట్లు చూపించి ప్రైవేటు వ్యక్తులకు లబ్ధి చేకూర్చేందుకు అధికారులు లోపాయికారి ఒప్పందం చేసుకుని అక్రమాలకు పాల్పడ్డారు. అసలు రోడ్డు అభివృద్ధి ప్రణాళిక లేని చోట బాండ్లు జారీ వల్ల ప్రజాధనం దుర్వినియోగమైందని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. గుంటూరు, మంగళ గిరి, చిలకలూరిపేట, చీరాలలో చాలా చోట్ల రోడ్డు అభివృద్ధి ప్రణా ళికలు ఇంతవరకు రూపొందించలేదు. అయినా ఆయా మున్సిపాలిటీల్లో ఇష్టం వచ్చినట్లు టీడీఆర్ బాండ్లు ఇచ్చేశారు. ఇబ్బడి ముబ్బడిగా బాండ్లు జారీ వల్ల రూ.10 కోట్ల వరకు ప్రజాధనం దుర్వినియోగమైనట్లు తేలింది.



రూ.9 వేలకు రూ.20 వేలు

గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలోని పందుల కాలనీలో డోర్ నెంబర్లు తప్పుగా వేసి టీడీఆర్ బాండ్లు జారీ చేశారు. ఇక్కడ మార్కెట్ విలువ గజం రూ.9 వేలు ఉంది. ఆ మేరకు టీడీఆర్ బాండ్‌ను జారీ చేయాల్సి ఉండగా, కిలోమీటరు ముందుకు వచ్చి స్థలం విలువ గజం రూ.20 వేలు ఉన్నట్లు చూపించి బాండ్‌ను జారీ చేశారు. 5400 చదరపు గజాల స్థలానికి బాండ్లు జారీ అయ్యా యి. దానివల్ల ఇక్కడ ఒక్క చోట రూ.5.85 కోట్లు వరకు ఖజానాకు నష్టం జరిగిందని విజిలెన్స్ అధికారులు గుర్తించారు.



ఆధార్ నో మోదు

- పుట్టిన తేదీ సర్టిఫికెట్ లేక ఆగిన ప్రక్రియ
- ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినా సా..గుతున్న వైనం
- ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రసవాలు.. ధ్రువీకరణపత్రాలు లేక జాప్యం
- నమోదు కాని పిల్లలు 80 వేల మంది

ఆధార్.. అందరికీ అవసరం. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఆధార్ తప్పనిసరి. అది లేకపోతే ఏ పని జరగలేదు. ప్రభుత్వ పథకాల లబ్ధి జరగాలన్నా.. పాఠశాలల్లో చేరలన్నా.. ప్రయాణాల్లో రిజర్వేషన్ సమయాల్లో ఆధార అవసరం ఉంది. అయితే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో 80 వేల మంది చిన్నారులకు ఆధార్ నమోదు కాలేదు. తల్లిదండ్రుల్లో అవగాహన లేమి.. మొదట్లో నిర్లక్ష్యం.. ఆ తర్వాత జనన ధ్రువీకరణపత్రాలు పొందలేక పిల్లలకు ఆధార్ నమోదు కాలేదు. ఇక ప్రభుత్వ పరంగా ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసిన గుర్తించిన చిన్నారులకు తప్పనిసరిగా నమోదు చేయించాలని సూచించినా జాప్యం జరుగుతోంది. గత ఏడాది డిసెంబరు 31కు గుర్తించిన ఆరేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు పూర్తి చేయాల్సి ఉన్నా.. ప్రక్రియ ఇంకా కొనసా...గుతూనే ఉంది.

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎంతో ముఖ్యం.. అవసరమైన ఆధార్ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 80 వేల మంది పిల్లలకు లేదు. వీరిలో ఎక్కువ మంది 0-6 సంవత్సరాల వయస్సు కలిగిన వారే ఉన్నారు. వీరు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరాలన్నా ఆధార్ తప్పనిసరి అవడంతో వారు అడ్మిషన్లు పొందలేకపోతున్నారు. ఆధార్ లేని పిల్లలకు ప్రభుత్వ పథకాలు అందవని అధికారులు చెబుతున్నారు. అయితే తల్లిదండ్రుల అవగాహన లేమి.. నిర్లక్ష్యం కారణంగా పిల్లలకు ఆధార్ నమోదు కాలేదు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం పిల్లల ఆధార్ నమోదు ప్రక్రియను సులభతరం చేసింది. అయినా గత ఏడాది డిసెంబరు 31 నాటికే పూర్తి కావాల్సిన ప్రక్రియ ఇంకా కొనసా...గుతూనే ఉంది. బిడ్డ పుట్టిన వెంటనే ఆధార్ నమోదుకు అవకాశం ఉంటుంది. బిడ్డ పుట్టిన తేదీ సర్టిఫికెట్ తీసుకుంటే తల్లి వేలిముద్రతో ఆధార్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అయినా గుంటూరు జిల్లాలో 23,774 మంది, పల్నాడు జిల్లాలో 39,755 మంది, బాపట్ల జిల్లాలో 16,552 మంది పిల్లలకు ఇప్పటి వరకు ఆధార్ రాలేదు. వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించిన ప్రసవాల నివేదిక ఆధారంగా ఆధార్ లేని పిల్లల సంఖ్యను గుర్తించారు. ఎక్కువ మంది 0-6 సంవత్సరాల వయస్సు కలిగిన వారే ఉండటం వల్ల చివరకు అంగన్‌వాడీ పాఠశాలలో కూడా చేర్చుకోని పరిస్థితి నెలకొంది.

పుట్టిన తేదీ సర్టిఫికెట్ అంటే తెలియదు..

ఆధార్‌లేని పిల్లల తల్లిదండ్రులకు అసలు పుట్టిన తేదీ సర్టిఫికెట్ అంటే ఏమిటో తెలియదని తెలుస్తోంది. దానివల్ల వారు ఇంతవరకు తమ బిడ్డలకు ఆ సర్టిఫికెట్ తీసుకోలేదని చెబుతున్నారు. వాస్తవానికి అన్ని ప్రసవాలు ఆస్పత్రిలోనే జరుగుతున్నా తల్లిదండ్రుల అవగాహన లేమి వల్ల అప్పట్లో పుట్టిన తేదీ సర్టిఫికెట్ తీసుకోకపోవడం శాపంగా మారింది. ఇప్పుడు అదే సర్టిఫికెట్ కోసం వెళ్తుంటే నానా ఇబ్బందులు ఎదురౌతున్నాయి. బిడ్డకు ఆధార్ రావాలంటే పుట్టిన తేదీ సర్టిఫికెట్ దరఖాస్తుకు జత పర్చాల్సి ఉంటుంది. మొన్నటి దాకా పుట్టిన తేదీ సర్టిఫికెట్ మంజూరు చేసే విషయంలో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. గడువు దాటిన సర్టిఫికెట్లు తహసీల్దార్ మంజూరు చెయ్యాల్సి రావడంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



ప్రత్యేక ఆధార్ కేంద్రాలు..

ఆధార్ లేకపోతే పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటారని భావించిన కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆరేళ్ల వయస్సు కలిగి ఇంకా ఆధార్ పొందని వారి కోసం ప్రత్యేక కేంద్రాలను తెరిచింది. గుంటూరు నగరంలో సుమారు 64 ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో ఎంపిక చేసిన సచివాలయాల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఇప్పుడు వైద్యులు చాలు..

ప్రభుత్వం 0-6 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లల ఆధార్ నమోదు ప్రక్రియలో కొన్ని మార్పులు చేసింది. తహసీల్దారు చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా ప్రసవం జరిగిన చోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఇచ్చే సర్టిఫికెట్ ఆధారంగా ఆధార్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. వాటిని కూడా పరిగణనలోకి తీసుకునే విధంగా నిబంధనలు సడలించారు. అయితే చాలామంది ప్రైవేటు వైద్యశాలల్లో ప్రసవమయ్యారు. ప్రస్తుతం అటువంటి జననాలకు పుట్టిన తేదీ సర్టిఫికెట్ జారీ చేసే విషయంలోనే సమస్యలు ఉన్నట్లు తెలుస్తోంది.

మహిళా పోలీసులదే బాధ్యత..



ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఆధార్‌లేని 80 వేల మంది పిల్లల డేటా సచివాలయాల్లోని మహిళా పోలీసులకు ఇచ్చాం. వారు ఆ డేటా ఆధారంగా తల్లిదండ్రుల వద్దకు వెళ్లి పుట్టిన తేదీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకునేలా చర్యలు చేపడతారు. ప్రతి మండలంలో నాలుగైదు సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను ఇందుకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశాం. తల్లిదండ్రులు కూడా వారి పిల్లలకు ఆధార్ ఉందో, లేదో చూసుకుని లేకపోతే వెంటనే దరఖాస్తు చేసుకోవాలి. - చొప్పర కృష్ణ, జడ్పీ డిప్యూటీ సీఈవో, జిల్లా సచివాలయాల అధికారి

పశువులకు నైట్రేట్ ముప్పు

- ప్రమాదంలో మూగజీవాల ప్రాణాలు
- తాగే నీటి ద్వారా దేహంలోకి మూలకం
- పొన్నూరు, తెనాలిలో హానికర స్థాయిలో నిల్వలు
- ఆవులు, గేదెల్లో కిడ్నీ ఫెయిల్యూర్, సంతాన లేమి కేసులు
- అన్ని మండలాల్లో నీటి నమూనాలు సేకరిస్తున్న పశుసంవర్ధక శాఖ

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్ర జ్యోతి): కిడ్నీలు విఫలమై జబ్బు పడుతున్న మూగజీవాలు.. ఆవులు, గేదెల్లో సంతానలేమి.. ఇలా పశుసంపద ప్రమాదంలో పడుతోంది. తాగే నీటి ద్వారా పశువుల దేహంలోకి ప్రవేశిస్తున్న నైట్రేట్ మూగ జీవాల ప్రాణం మీదకు తెస్తుంది. పొన్నూరు, తెనాలి నియోజకవర్గాల్లో గేదెలు, ఆవులు తాగుతున్న నీటిలో హానికర స్థాయిలో నైట్రేట్ నిల్వలు ఉన్నట్లు తేలింది. ఈ



ప్రభావంతో పశువుల్లో కిడ్నీ ఫెయిల్యూర్ కేసులు పెరగడం, సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గడం, చివరకు ప్రాణాలు సైతం పోయే పరిస్థితి పొంచి ఉన్నట్లు పశుసంవర్ధకశాఖ గుర్తించింది. పొన్నూరు మండలం తాళ్లపాలెం గ్రామానికి చెందిన పశువులు సరిగా మేత మేయకపోవడం, నీరు తాగక పోవటం వంటి లక్షణాలతో వస్తూ ఉండటం పశుసంవర్ధక శాఖ ఏడీఏ డాక్టర్ కేశవరావు గమనించారు. అనుమానం వచ్చి అక్కడున్న పశువులకు కిడ్నీ పరీక్షలు చేయించగా ఇబ్బంది కరమైన ఫలితాలు వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన ఏడీఏ గ్రామంలో పశువులు తాగుతున్న నీటిని సేకరించి పరీక్షల నిమిత్తం పంపగా మోతాదుకు మించిన స్థాయిలో నైట్రేట్ ఉన్నట్లు తేలింది. పొన్నూరు మండలం నిడుబ్రోలు, మాచవరం, తెనాలి మండలం అంగలకుదురు, ఖాజీపేట, పినపాడు తదితర గ్రామాల్లో పశువులు పదేపదే తిరగకడుతుండటంతో అనుమానం వచ్చిన అధికారులు అక్కడ నీటిని సేకరించి విజయవాడలోని వెటర్నరీ బయో లాజికల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు పరీక్షల నిమి త్తం పంపారు. అక్కడ జరిపి న పరీక్షల్లో ఆయా ప్రాంతాల్లోని నీటిలో నైట్రేట్ నిల్వల శాతం 245 పీపీఎం (మిగతా 8వ పేజీలో)



వణికిస్తున్న.. కామోన్మాదులు

- అత్యాచారం.. ఆపై హత్యలతో చెలరేగుతున్న సైకో
- పోలీసునని బెదిరించి అత్యాచారం చేయడంలో దిట్ట

గుంటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్ర జ్యోతి): కామోన్మాదులు జిల్లా వాసులను వణికిస్తు న్నారు. కామ వాంఛను తీర్చుకోవడానికి వారెంతటి ఘాతుకానికైనా తెగబడే నేర స్వభావం కలిగి ఉండడం తో సర్వత్ర ఆందోళన కలిగిస్తోంది. వీరి నేర ప్రవృత్తి పోలీసులను సైతం విస్మయానికి గురిచే స్తోంది. వీరిలో ఒకరు ఒంటరి గా ఉండే వృద్ధ మహిళలను టార్గెట్ చేసి వారిపై అత్యా చారం చేయడమే గాక హత్యలకు పాల్పడుతుండడం కలకలం రేపుతోంది. మరొకరైతే ఏకంగా తాను పోలీస్‌నని చెప్పుకుంటూ ఏకాంతంగా ఉండే యువ జంటలను గుర్తించి వారిని బెదిరించి యువతులపై అత్యాచారానికి పాల్పడుతుంటాడు.

వెలుగు చూడని దారుణాలు మరెన్నో..

ఇటువంటి విషయాలు బయటకు చెప్పుకుంటే జీవితం నాశనం అవుతుందన్న భయంతో విద్యార్థినులు, ముఖ్యంగా యువతులు గోప్యంగా ఉంచుతున్నారు. వారి బలహీనతే గోపికి బలంగా మారుతోంది. ఇప్పటికే గోపి ఈ తరహాలో అనేక నేరాలకు పాల్పడి ఉంటాడని పోలీసులు అంచనాకు వచ్చాయి. గుంటూరుతో పాటు చేబ్రోలు, తెనాలి రూరల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోనూ పలు నేరాలకు పాల్పడి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తు న్నారు. ప్రస్తుతానికి పీడీ యాక్ట్ ప్రయోగించి కనీసం ఆరు నెలలు బయటకు రాకుండా నిర్బంధించాలనే పోలీసులు నిర్ణయానికి వచ్చారు.

ఒంటరిగా ఉండే వృద్ధ మహిళలే టార్గెట్..

గడిచిన మూడేళ్లలో అత్యధిక కాలం రిమాండ్‌లో ఉన్నా జైలు నుంచి విడుదలయ్యాడంటేనే ఎవరో ఒక వృద్ధ మహిళ బలైనట్లేనని పెదనందిపాడుకు చెందిన కామోన్మాది మంజు నేర ప్రవృత్తి స్పష్టం చేస్తుంది. ఇటీవల ఒంటరిగా ఉంటోన్న రమణమ్మ అనే వృద్ధురాలుపై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటన సంచలనం సృష్టించింది. మంజు గతంలో పెద నందిపాడు, కాకుమాను పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇద్దరు వృద్ధ మహిళలపై అత్యాచారానికి పాల్పడ్డాడు. 2023లో వృద్ధురాలిపై అత్యాచారంతో షాక్‌కు గురైన బాధితురాలు కొద్ది రోజులకే కన్నుమూసింది. 2024లో మరో వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ కేసులో అరెస్టు అయిన మంజు ఇటీవలే బెయిల్‌పై జైలు నుంచి విడుదలయ్యాడు. బయటకు వచ్చిన నాలుగు రోజుల వ్యవధిలోనే రమణమ్మపై అత్యాచారం చేసి హత్య చేశాడు. దీంతో పోలీసులు మంజు తోపాటు అతడితో కలసి నేరానికి ఒడిగట్టిన సాంబ అనే వ్యక్తిని కూడా అదుపులోకి తీసు కుని విచారిస్తున్నారు.

జంటలే టార్గెట్‌గా కామోన్మాది గోపి

జంట కనిపిస్తే కానిస్టేబుల్‌నని, స్టేషన్‌కు రావాలంటూ ప్రియుడ్ని బెదిరించి ప్రియురాలిపై అత్యాచా రం చేస్తోన్న కామోన్మాది గోపి వ్యవ హారం పోలీసులకు సవాల్‌గా మారింది. చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామానికి చెందిన గోపి నిర్జన ప్రదేశాలు, శివారు ప్రాం తాల్లో ఏకాంతంగా గడపడానికి వచ్చే ప్రేమ జంటలను లక్ష్యంగా చేసుకొని ఆకృత్యాలు సాగిస్తుంటాడు. కొన్ని నెలల క్రితం కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి ఓ జంటను బెదిరించి, స్టేషన్‌కు వెళదాం అంటూ యువతిని ద్విచ క్రవాహనంపై ఎక్కించుకుని నెహ్రూనగర్ వైపు తీసుకువెళ్లి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గోపిని అరెస్టు చేశారు. దీంతో గోపి అకృత్యాలు పోలీసుల దృష్టికి వచ్చాయి. ఆ కేసులో జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత కొద్ది రోజులకే జాతీయ రహదారిపై తక్కెళ్ళపాడు, బుడంపాడు గ్రామాల మధ్య ఏకాంతంగా ఉన్న ఓ జంటను కానిస్టేబుల్‌నని బెదిరించి ఆ యువతిపై అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. పరువు పోతుందనే భయంతో బాధిత యువతి విషయాన్ని పోలీసులకు చెప్పలేకపోయినట్లు తెలిసింది. ఇదే తరహాలో పాతగుంటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో జంటపై కూడా గోపి అత్యాచారానికి పాల్పడినట్లు సమాచారం.

అనుమతులు ముగిసినా.. ఆగని తవ్వకాలు

- గాజుల్లంక వద్ద రాత్రివేళ యంత్రాలతో ఇసుక లోడింగ్
- పట్టించుకోని అధికారులు

ఎల్ఎల్‌బీ, బీఏ ఎల్ఎల్‌బీ హానర్స్ ఫలితాల విడుదల

బస్సు-బైక్ ఢీ

- వివాహానికి వెళ్తున్న ఇద్దరు దుర్మరణం
- నలుగురికి తీవ్ర గాయాలు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన కానిస్టేబుల్ మృతి

రూ.16 లక్షలు జరిమానా

6

11 నామినేషన్‌ల

దాఖలు

- కోలాహలంగా గుంటూరు కలెక్టరేట్
- ఇక మిగిలింది చివరి రోజైన 10వ తేదీ మాత్రమే

8



ఆర్‌సీసీ బ్లాకులు వస్తున్నాయ్..

డొంకరోడ్డులోని మూడొంతెనల విస్తరణ పనులు ఊపందుకున్నాయి. ఆర్‌సీసీ బ్లాకులతో ఆర్‌యూబీ నిర్మాణం చేస్తున్నారు. ఇప్పటికి సగం బ్లాకుల వరకు అమర్చారు. ఇంకా మరో 28 బ్లాకుల వరకు అమర్చాల్సి ఉన్నట్లు సమాచారం. ప్రత్యేక ట్రైలర్లలో ఆర్‌సీసీ బ్లాకులను నల్లపాడు నుంచి అమరావతి రోడ్డు మీదగా డొంకరోడ్డుకు తీసుకొస్తున్నారు. ఈ కారణంగా మార్గమధ్యలో ట్రాఫిక్ అవాంతరాలు ఏర్పడుతున్నాయి. వాహనదారులు ఆర్‌సీసీ బ్లాకు కింద కొంత ఖాళీ ఉండటంతో అందులో జొరబడుతూ ట్రైలర్ వాహనాన్ని క్రాస్ చేసి ముందుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ఇది ప్రమాదకరం కావడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న ఆందోళన నెలకొన్నది.

- గుంటూరు ఆంధ్రజ్యోతి



ఎల్‌ఎల్‌బీ, బీఏ ఎల్‌ఎల్‌బీ హానర్స్ ఫలితాల విడుదల

పెదకాకాని, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో గత అక్టోబరు నెలలో నిర్వహించిన ఎల్.ఎల్.బి, బీఏ ఎల్‌ఎల్‌బీ హానర్స్ ఫలితాలను శుక్రవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరీక్షల నిర్వహణ, నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు విడుదల చేశారు. ఈ సందర్భముగా ఆలపాటి శివప్రసాదరావు మాట్లాడుతూ మూడేళ్ల ఎల్‌ఎల్.బి , ఐదేళ్ల బీఏ ఎల్‌ఎల్ బీ హానర్స్, బీబీఏ ఎల్‌ఎల్‌బీ హానర్స్ కోర్సులకు చెందిన పలు సెమిస్టర్‌ల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ రెండో సెమిస్టర్ పరీక్షలకు 551 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 396 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఐదేళ్ల కోర్సులో 7వ సెమిస్టర్ పరీక్షలను 305 మంది విద్యార్థులు రాయగా 209 మంది ఉత్తీర్ణత సాధించారని అన్నారు. రెండో సెమిస్టర్ పరీక్షలను 390 మంది విద్యార్థులు రాయగా 116 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. ఐదేళ్ల బీఏ ఎల్‌ఎల్. బి హానర్స్ కోర్సులో 26 మంది విద్యార్థులు రెండో సెమిస్టర్ పరీక్షలు రాయగా 14 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. బీబీఏ ఎల్‌ఎల్‌బీ హానర్స్ కోర్సులో 25 మంది విద్యార్థులు రెండో సెమిస్టర్ పరీక్షలు రాయగా 21 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా అదనపు పరీక్షల నిర్వహణాధికారి రెడ్డి ప్రకాశరావు మాట్లాడుతూ రూ. 1860 చెల్లించి పునః మూల్యాంకనంకు దరఖాస్తు చేసు కోవడానికి ఫిబ్రవరి 25వ తేదీ వరకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఫలితాల వివరాలను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అధికారిక వెబ్సైట్‌లో పొందవచ్చని పేర్కొన్నారు.

ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించాలి



ఆలపాటికి శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రులు అనగాని, గొట్టిపాటి రవి

రేపల్లె, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి చేస్తున్న ప్రయత్నాలకు మద్దతుగా ఆలపాటి రాజాని గెలిపించాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం గుంటూరులోని ఆయన నివాసంలో కూటమి బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజాని నామినేషన్ సందర్భంగా మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలపాటి రాజాని రెండు జిల్లాల వాసులు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. 2024 ఎన్నికల్లో శాసనసభలో ప్రక్షాళన జరిగిందనీ, ఇక శాసనమండలిలోను ప్రక్షాళన కోసం ఆలపాటి రాజా గెలుపు అవసరం అన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, మాజీ జడ్పీ ఉపాధ్యక్షుడు పూర్ణ పాల్గొన్నారు.

అనుమతులు ముగిసినా.. ఆగని తవ్వకాలు

- రాత్రివేళ యంత్రాలతో ఇసుక లోడింగ్
- పట్టించుకోని అధికారులు



గాజుల్లంక ఇసుక రీచ్‌లో శుక్రవారం రాత్రి లారీకి ఇసుక నింపుతున్న యంత్రం

కొల్లూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇసుక తవ్వకాలకు సంబంధించి పర్యావరణ అనుమతులు ముగిసినప్పటికీ ఇసుక తవ్వకాలు రాత్రివేళ యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. బాపట్ల జిల్లా కొల్లూరు మండల పరిధిలో గాజుల్లంక వద్ద గత ఏడాది ప్రభుత్వం ఉచిత ఇసుక రీచ్‌కు అనుమతులు ఇచ్చింది. ఆయా అనుమతులు శుక్రవారం సాయంత్రం ఆరు గంటలతో ముగిసినా గుత్తేదారులు మాత్రం రాత్రింబవళ్లు ఇసుక తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతులు ముగుస్తున్నాయని మధ్యాహ్నం నుంచే ట్రాక్టర్లకు ఇసుక పోయడాన్ని నిలిపి వేశారు. అప్పటి నుంచి భారీ యంత్రాలతోనే నదిలో భారీ వాహనాలలో ఇసుకను లోడింగ్ చేశారు. సాయంత్రం 6 గంటలకు పర్యావరణ అనుమతులు ముగిసినా తవ్వకాలు మాత్రం గుత్తేదారులు ఆపలేదు. భారీ వాహనాలకు తెల్లవార్లు నదిలోని ఇసుకను యంత్రాలతో తోడి పోశారు. మరో నాలుగు రోజుల్లో అనుమతులు వచ్చే అవకాశం ఉన్నా, అప్పటి దాకా కూడా ఆగకుండా నిబంధనలు ఉల్లంఘించి ఇసుక తవ్వకాలు చేయడం గమనార్హం. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు ఇసుక రీచ్‌లు గురువారం సాయంత్రం మూతపడ్డాయి. ఆయా మండలాల రెవెన్యూ అధికారులు గుత్తేదారులకు అనుమతులు ముగిసినట్లు నోటీసులు ఇవ్వడంతో పాటు నదిలో ఇసుక తవ్వే ప్రదేశానికి వెళ్లే మార్గాలను తవ్వించి ఇసుక తవ్వకాలకు ఆస్కారం లేకుండా అడ్డుకట్ట వేశారు. ఇక్కడ మాత్రం గుత్తేదారులకు అనుమతులు ముగిసినట్లు నోటీసులు ఇచ్చిన దాఖలాలు లేవు. పైగా మైనింగ్, రెవెన్యూ అధికారులు అనుమతులు ముగిసిన అనంతరం తీసుకోవాల్సిన చర్యలు లేకపోవడంతో గుత్తేదారులు ఇష్టారాజ్యంగా తెల్లవార్లు ఇసుకతో పాటు బుసక తవ్వకాలు నిరంతరంగా సాగించారు.

ఆరు యూనిట్ల ఇసుక ధర రూ.8 వేలకు పెంపు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇసుక రీచ్‌లు మూత పడటంతో శుక్రవారం గాజుల్లంక రీచ్‌లో ఒక్కసారిగా ఇసుక ధరలు పెంచేశారు. నిన్నమొన్నటి వరకు ఆరు యూనిట్లు ఇసుక రూ.6 వేలకు, ఏడు యూనిట్లు రూ.6500-7000 వేల ధరకు లారీలకు లోడ్ చేశారు. శుక్రవారం మాత్రం గాజుల్లంక రీచ్ మాత్రమే ఇసుక తవ్వకాలు చేసేందుకు అనుమతులు ఉండటంతో ఇదే అదునుగా గుత్తేదారులు రూ.8 వేలకు ఇసుక ధరను పెంచి అమ్మకాలు సాగించారు.

డంపింగ్ నిల్వలు పరిశీలన

కొల్లిపర, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో మున్నంగి, పిడపర్తిపాలెం, బొమ్మువానిపాలెంలో ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన ఇసుకరీచ్‌లు గడువు ముగియటంతో గురువారం సాయంత్రం ఆర గంటలకు మూతపడ్డాయి. దీంతో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని మున్నంగి, పిడపర్తి పాలెం, బొమ్మువానిపాలెం ఇసుకరీచ్‌ల్లో డంపింగ్ చేసిన నిల్వలను మైనింగ్ సర్వేయర్ సీతమ్మబాయ్, టెక్నికల్ అసిస్టెంట్ కావ్య, జూనియర్ అసిస్టెంట్ సల్మాన్, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, విలేజ్ సర్వేయర్ మోహన్‌సాయి, శ్రీనివాసరావు, వీఆర్వోలు రామారావు, ఆనంద్ పరిశీలించారు. తహసీల్దార్ సిద్ధార్థ ఆదేశాల మేరకు డంపింగ్ నిల్వలను సంబంధిత వీఆర్వోలకు అప్పగించనున్నట్లు మైనింగ్ అధికారులు తెలియజేశారు.



బొమ్మువానిపాలెంలో డంపింగ్ చేసిన ఇసుకను పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు

ఆలపాటి గెలుపునకు కృషి చేయాలి

- ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీరెడ్డి



సభలో మాట్లాడుతున్న జీవీరెడ్డి

కారంపూడి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు కోసం కూటమి నేతలు కృషి చేయాలని ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పద్మావతి ఫంక్షన్ హాలులో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడుతుందన్నారు. అనుభవజ్ఞుడైన రాజేంద్రప్రసాద్‌ను గెలిపిస్తే ఈ ప్రాంతాభివృద్ధికి చర్యలు తీసుకొని, నిధులు మంజూరుకు కృషి చేస్తారన్నారు. మాచర్ల నియోజకవర్గంలో ఆలపాటికి అత్యధిక మెజార్టీ తెప్పించి విమర్శకుల నోరు మూయించి ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, జిల్లా అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్, చప్పిడి రాము, మునుగోటి సత్యం, కటికల బాలకృష్ణ, మస్తాన్ జాని, పంగులూరి లక్ష్మయ్య, క్లస్టర్ ఇన్‌చార్జిలు శ్రీనివాసరావు, ప్రభాకర్, జనసేన నేతలు బూసా రామాంజినేయులు, కృష్ణబాబు, బీజేపీ నేతలు నాసరయ్య, హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మాచర్ల నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీ తీసుకురావాలని ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీరెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రమైన దుర్గిలోని సత్యసాయి కల్యాణ మండపంలో నిర్వహించిన ప్రచార సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

రూ.16 లక్షలు జరిమానా



ప్రకాష్ కుమార్, మైనింగ్ ఏడీ

దాచేపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతి లేకుండా, సరైన బిల్లులు లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్న గ్రానైట్ లారీలకు రూ.16 లక్షలు జరిమానా విధించినట్టు దాచేపల్లి మైనింగ్ ఏడీ ప్రకాష్ కుమార్ శుక్రవారం తెలిపారు. ప్రకాశం జిల్లా మార్టూరు నుంచి, వినుకొండ నుంచి కారంపూడి, గురజాల, పులిపాడుల మీదుగా పొందుల సమీపంలోని రాష్ట్ర రహదారి మీదుగా తెలంగాణ రాష్ట్రంలోకి గ్రానైట్ రాళ్ల లారీలు తరలిపోతున్నాయని సమాచారం వచ్చినట్టు తెలిపారు. దీంతో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, మైనింగ్ శాఖ అధికారులు సంయుక్త ఆధ్వర్యంలో బిల్లులు లేకుండా అక్రమంగా తరలిపోతున్న వాహనాలను పట్టుకున్నట్లు తెలిపారు. నాలుగు లారీలను అదుపులోకి తీసుకున్నామన్నారు. డిసెంబరు నెలలో రూ.4 లక్షలు, జనవరి నెలలో రూ. 12 లక్షలు అపరాధ రుసుం విధించినట్టు తెలిపారు. రాత్రి సమయాల్లో ఆయా శాఖల అధికారులు తనిఖీలు చేస్తుండటాన్ని గమనించిన కొన్ని లారీలు పగటి పూటనే నేరుగా తెలంగాణ రాష్ట్రానికి చేరుకుంటున్నాయని వివరించారు. ఈ సమాచారంతో పగటి పూట కూడా తనిఖీలు ముమ్మరం చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీ ప్రకాష్ కుమార్ స్పష్టం చేశారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 546.90 అడుగులు ఉంది. ఇది 203.00టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,120, ఎడమ కాలువ ద్వారా 5156, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 12,230, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2200, ఎల్ఎల్‌సీ ద్వారా 280, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 29,986 నీటిని విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	113,121,132
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

కలిసి పనిచేద్దాం.. అభివృద్ధిని సాధిద్దాం

- ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండటౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వినుకొండ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, ఆయన సతీమణి 30వ వార్డు కౌన్సిలర్ షకీలాతోపాటు 27వ వార్డు కౌన్సిలర్ హేమలత, 18వ వార్డు కౌన్సిలర్ పాల్వాది ప్రసన్నాంజనేయులు, 9వ వార్డు కౌన్సిలర్ రెడ్డి నాగపద్మ వైసీపీకి రాజీనామా చేసి ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సమక్షంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన కౌన్సిలర్లకు జీవీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి మాట్లాడుతూ డాక్టర్ వృత్తిలో ఉండి ఎంతో ఆశతో పార్టీలో చేరామని, పార్టీలో ఉన్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సహకారం లేదని తెలిపారు. ఒక ట్రస్టీగా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నట్లు ఆయన తెలిపారు. గతంలో అభివృద్ధి పేరిట అవినీతి జరిగిందనీ, జీవీ ఏ బాధ్యత ఇచ్చిన భార్యభర్తలం ఇద్దరం జన్మాంతరం పనిచేస్తామని తెలిపారు. అనంతరం ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ కలిసి పని చేసి పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందాం అన్నారు. పార్టీలో చేరిన కౌన్సిలర్లకు తప్పనిసరిగా గౌరవం ఉంటుందని అన్నారు. చంద్రబాబు నాయుడు చేస్తున్న అభివృద్ధి చూసి పార్టీలోకి వస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతోపాటు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన కానిస్టేబుల్ మృతి

- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- హాజరైన ఎస్పీ, అధికారులు



ఇమ్రాన్‌వలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్



మృతుడు ఇమ్రాన్‌వలి (ఫైల్)

గుంటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టాభిపురం పోలీస్ స్టేషన్ సమీపంలో ఈ నెల 5న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ షేక్ ఇమ్రాన్‌వలి శుక్రవారం మృతి చెందారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మృతుడి స్వగ్రామం మంగళగిరి పరిధిలోని నవులూరులో ఇమ్రాన్‌వలి భౌతిక కాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ తరఫున లక్ష రూపాయల చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందించి, శాఖా పరంగా అందాల్సిన అన్ని ప్రయోజనాలను సకాలంలో అందించడానికి కృషి చేస్తామని చెప్పారు. ఎప్పుడు ఏ ఆపద వచ్చినా కానిస్టేబుల్ ఇమ్రాన్ వలి కుటుంబానికి పోలీస్ శాఖ అండగా ఉంటుందని ఎస్పీ భరోసా ఇచ్చారు. ఇమ్రాన్ వలి 2012లో కానిస్టేబుల్‌గా చేరి పలు పోలీస్ స్టేషన్లలో పనిచేసి, ప్రస్తుతం కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొబేషనరీ ఐపీఎస్ దీక్షా, మంగళగిరి రూరల్ సీఐ శ్రీనివాసరావు, తాడికొండ సీఐ వాసు, ఆర్ఐ శ్రీహరి రెడ్డి, మంగళగిరి రూరల్ ఎస్సై వెంకటేశ్వర్లు, పోలీస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు షైలా సాంబశివరావు, సెక్రటరీ లక్ష్మయ్య, పలువురు పోలీస్ సిబ్బంది, కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ మృతి

కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ శుక్రవారం మృతి చెందాడు. పిన్నెల్లి చంద్ర శేఖర్ 1983లో పోలీస్ విభాగంలో ఏపీఎస్పీ కానిస్టేబుల్‌గా చేరి, 2005లో ఏఆర్ కానిస్టేబుల్‌గా కన్వర్షన్ అయ్యి, తదుపరి ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగోన్నతి పొంది ఏఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. సుమారు 40 సంవత్సరాల పాటు సుదీర్ఘకాలంగా పోలీస్ శాఖకు విశేషసేవలందించారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఏటీ అగ్రహారంలోని స్వగృహంలో ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులకు పోలీస్ విభాగం తరఫున ఆర్ఐ శ్రీహరి రెడ్డి, పోలీస్ అసోసియేషన్ సభ్యులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పోలీస్ శాఖ తరఫున రూ. లక్ష చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందించి, శాఖా పరంగా అందాల్సిన అన్ని ప్రయోజనాలను సకాలంలో అందిస్తామని, పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

93,597 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 84,278 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 93,597 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 65,583 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	9000	13700	334	9500	11000
నెంబరు. 5	10000	14000	నెంబరు.5	--	--
273	10000	13500	273	--	--
341	10000	14700	341	--	--
4884	10000	12000	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14500	తేజ	10000	14000
బ్యాడిగి	10000	13600	బ్యాడిగి	11000	12000
దేవనూరు డీలక్స్	10000	13500	దేవనూరు డీలక్స్	--	--
తెల్లకాయలు	4000	7500	తెల్లకాయలు	4000	7500

వివాహానికి వెళ్తూ దుర్మరణం

- బస్సు ఢీకొని ఇద్దరు మృతి
- నలుగురికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి కారణమైన బస్సు

రాజుపాలెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బస్సు ఢీకొని ఇద్దరు మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. సేకరించిన సమాచారం మేరకు.. మండలంలోని కోటనెమలిపురి గ్రామానికి చెందిన సానికొమ్ము సుబ్బారెడ్డి(46), దేవిరెడ్డి శ్రీనివాస రెడ్డి(45) వరుసకు బావ, బావమరుదులు. క్రోసూరు మండలం పీసపాడు గ్రామంలో వారి బంధువుల ఇంట్లో శుక్రవారం రాత్రి వివాహం జరుగుతుంది. ఈ వివాహనికి హాజరయ్యేందుకు కోటనెమలిపురి గ్రామం నుంచి ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. మార్గమధ్యలో రెడ్డిగూడెం గ్రామ సమీపానికి వచ్చేటప్పటికీ గుంటూరు నుంచి మాచర్ల వెళ్తున్న మాచర్ల డిపోకు చెందిన ఏపీ 40జెడ్ 0240 నంబరు కలిగిన ఆర్టీసీ బస్సు అతివేగంతో వచ్చి ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లి తరలించారు. గుంటూరు నుంచి మాచర్ల వెళ్తున్న ఆర్టీసీ బస్సు మార్గమధ్యలోని రెడ్డిగూడెం దాటిన తరువాత ఎదురుగా వస్తున్న రెండు కార్లను, రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొనటంతో ఆ శబ్దానికి సమీపంలో ఉన్న వారు సంఘటనా స్థలానికి పరుగులు తీశారు. సమాచారం అందుకున్న ఎస్సై వేణుగోపాల్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తమిళనాడ్ మర్కంటైల్ బ్యాంక్ లిమిటెడ్ గుంటూరు శాఖ, డో.నెం.24-2-49, పట్నం బజార్, చాపరాలవారి వీధి, చుండూరు మ్యాన్షన్, గుంటూరు, ఎ.పి-522003, ఫోన్ : 0863-2222964.

శీతల గిడ్డంగిలోని నిల్వల (ఎండుమిర్చి) అమ్మకపు వేలం ప్రకటన

తమిళనాడు మర్కెంటైల్ బ్యాంక్, గుంటూరు శాఖ యందు ఈ క్రింద పేర్కొనబడిన ఖాతాదారులు వారి యొక్క ఎండు మిర్చి శీతల గిడ్డంగిలో భద్రపరచిన రశీదులు కుదువపెట్టి ఋణము పొంది సకాలములో చెల్లించని కారణముగా బకాయిదారులకు వేలము నోటీసు జారీ చేయబడినది. ఈ క్రమములో నోటీసులో పేర్కొనబడిన **వేలము తేదిలు: ది.18-02-2025, ది.19-02-2025, ది.24-02-2025, ది.25-02-2025 మరియు ది.27-02-2025న ఉ॥ 11.00 గం॥ల** నుండి మా శాఖ ఆవరణము నందు జరుగునని యావద్మందికి తెలియచేయటమైనది.

షరతులు: 1.పైన తెలిపిన మిర్చి బస్తాలను కొనుగోలు చేయదలిన వారు 'తమిళనాడ్ మర్కెంటైల్ బ్యాంక్ లిమిటెడ్' పేరుతో డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా జమచేయవలెను. విజయవంతమైన పాటదారుడు మొత్తం బిడ్ సొమ్ములో 10% అదే రోజున చెల్లించవలెను.
2.మిర్చి బస్తాలను గిడ్డంగి నుండి వారి ప్రాంతమునకు తరలించుటకు అయ్యే ఖర్చులను విజయవంతమైన పాటదారుడే భరించవలెను.
3.ఋణగ్రహీత ఈ పత్రికా ప్రకటనను నోటీసుగా భావించవలెను.
4.పైన తెలిపిన మిర్చి బస్తాలు రిజర్వు ధర కంటే తక్కువ ధరకు అమ్మబడవు.
5. వేలం నందు పాల్గొనదలచిన పాటదారులు వారి యొక్క ధృవీకరణ పత్రాలు అనగా పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డు, ఓటర్ ఐడి కార్డు మరియు పాన్ కార్డు వంటివి ఏదైనా సమర్పించవలెను.
6. ఎట్టి కారణము చూపకనే వేలం తిరస్కరించుటగాని, వేలము ఆపివేయుటగాని లేదా వాయిదా వేయుటకు గాని బ్యాంక్ అధీకృత అధికారికి పూర్తి అధికారము కలదు.
వివరముల కొరకు బ్రాంచి మేనేజర్, ఫోన్ : 9866536667/9150039682/9150038357 సంప్రదించగలరు.

ఖాతా నెంబరు	ఖాతాదారుని పేరు	మంజూరు తేది	కోల్డ్ స్టోరేజ్	గోదాంలోని నిల్వలు (బ్యాగుల సంఖ్య)	రిజర్వు ధర	వేలం తేది
074700220103222	శ్రీ బత్తుల నాగేశ్వరరావు	13-03-2024	మెస్సర్స్ రాఘవేంద్ర కోల్డ్ స్టోరేజ్ ప్రైవేట్ లిమిటెడ్	52	రూ.1,66,400/-	18.02.2025
074700220103200	శ్రీ ఉప్పుతోళ్ళ రమేష్	12-03-2024	మెస్సర్స్ రాఘవేంద్ర కోల్డ్ స్టోరేజ్ ప్రైవేట్ లిమిటెడ్	580	రూ.17,40,000/-	19.02.2025
074700220103148	శ్రీ బొగ్గుల రఘుపతిరెడ్డి	07-03-2024	మెస్సర్స్ రైతుమిత్ర కోల్డ్ స్టోరేజ్ ప్రైవేట్ లిమిటెడ్	109	రూ.3,70,600/-	24.02.2025
074700220103150	శ్రీ కిల్లా సాంబయ్య	07-03-2024	మెస్సర్స్ రాఘవేంద్ర కోల్డ్ స్టోరేజ్ ప్రైవేట్ లిమిటెడ్	87	రూ.2,78,400/-	24.02.2025
074700220103151	శ్రీ ఓరుగంటి సోమయ్య	07-03-2024	మెస్సర్స్ రాఘవేంద్ర కోల్డ్ స్టోరేజ్ ప్రైవేట్ లిమిటెడ్	83	రూ.2,98,800/-	24.02.2025
074700220103153	శ్రీ మేకల సాంబయ్య	07-03-2024	మెస్సర్స్ రాఘవేంద్ర కోల్డ్ స్టోరేజ్ ప్రైవేట్ లిమిటెడ్	159	రూ.5,40,600/-	24.02.2025
074700220103197	శ్రీ మేకల సాంబయ్య	12-03-2024	మెస్సర్స్ రాఘవేంద్ర కోల్డ్ స్టోరేజ్ ప్రైవేట్ లిమిటెడ్	94	రూ.3,27,120/-	24.02.2025
074700220103155	శ్రీ మర్రి బంగారు బాబు	07-03-2024	మెస్సర్స్ రాఘవేంద్ర కోల్డ్ స్టోరేజ్ ప్రైవేట్ లిమిటెడ్	139	రూ.4,72,600/-	24.02.2025
074700220103163	శ్రీ గుంజి అంకమ్మరావు	07-03-2024	మెస్సర్స్ రైతుమిత్ర కోల్డ్ స్టోరేజ్ ప్రైవేట్ లిమిటెడ్	89	రూ.3,02,600/-	24.02.2025
074700220103166	శ్రీ ఒంటేరు గాంధి	07-03-2024	మెస్సర్స్ విజయ పద్మావతి కోల్డ్ స్టోరేజ్ ప్రైవేట్ లిమిటెడ్	186	రూ.6,32,400/-	24.02.2025
074700220103171	శ్రీ గడ్డి వెంకటరెడ్డి	11-03-2024	మెస్సర్స్ రైతుమిత్ర కోల్డ్ స్టోరేజ్ ప్రైవేట్ లిమిటెడ్	166	రూ.5,77,680/-	25.02.2025
074700220103172	శ్రీ తోటపూల లోకేశ్వరరావు	11-03-2024	మెస్సర్స్ రైతుమిత్ర కోల్డ్ స్టోరేజ్ ప్రైవేట్ లిమిటెడ్	185	రూ.5,55,000/-	25.02.2025
074700220103173	శ్రీ కొరివి శ్రీనివాసరావు	11-03-2024	మెస్సర్స్ రైతుమిత్ర కోల్డ్ స్టోరేజ్ ప్రైవేట్ లిమిటెడ్	63	రూ.2,39,400/-	25.02.2025
074700220103176	శ్రీ తోటపూల వెంకట కృష్ణ	11-03-2024	మెస్సర్స్ రైతుమిత్ర కోల్డ్ స్టోరేజ్ ప్రైవేట్ లిమిటెడ్	302	రూ.10,38,880/-	25.02.2025
074700220103186	శ్రీ పుట్టా వెంకట రమణయ్య	11-03-2024	మెస్సర్స్ రాఘవేంద్ర కోల్డ్ స్టోరేజ్ ప్రైవేట్ లిమిటెడ్	150	రూ.4,50,000/-	25.02.2025
074700220103206	శ్రీ వాసిరెడ్డి లక్ష్మీనారాయణ	12-03-2024	మెస్సర్స్ సత్తెమ్మతల్లి కోల్డ్ స్టోరేజ్ ప్రైవేట్ లిమిటెడ్	382	రూ.14,51,600/-	27.02.2025
074700220103208	శ్రీ రఫీ షేక్	12-03-2024	మెస్సర్స్ శ్రీ లక్ష్మి నరసింహా కోల్డ్ స్టోరేజ్ ప్రైవేట్ లిమిటెడ్	200	రూ.6,00,000/-	27.02.2025

తేది : 07-02-2025, ప్రదేశం : గుంటూరు

సం/- బ్రాంచి మేనేజర్, తమిళనాడు మర్కెంటైల్ బ్యాంక్ లిమిటెడ్, గుంటూరు బ్రాంచి, గుంటూరు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుంటూరు,ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రెండో శనివారం సందర్భంగా నగరంలో పలు ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. ఈ మేరకు గుంటూరు టౌన్ 1 ఈ ఈ శ్రీనివాస బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి గరికపాటి ప్రవచనాలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురం, శ్రీ రమా సత్యనారాయణ స్వామి వారి బ్రహోత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో నేటి నుంచి మూడు రోజుల పాటు మహా సహస్రావధాని డాక్టర్ గరికపాటి నరసింహారావు ప్రవచనాలు జరగనున్నాయి. ఈ విషయాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు చావలి గణపతి, బ్రహోత్సవాల కన్వీనర్ రావిపాటి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 'భారత యుద్ధంలో భగవంతుని పాత్ర' అనే అంశంపై ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు ప్రవచనం ఉంటుందని, ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని తెలిపారు.



ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ప్రదర్శనలో వేమూరు ఎమ్మెల్యే ఆనంద బాబుతో ఎమ్మెల్సీ ఎన్నికల వినుకొండ నియోజకవర్గ పరిశీలకుడు, టీడీపీ సీనియర్ నాయకుడు పంచుమర్తి భూపతిరావు, బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు చావలి శ్రీనివాస్ యాదవ్.
(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

ప్రాంగణ ఎంపికల్లో కోర్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తమ కళాశాలలోని కోర్ ఇంజనీరింగ్ విద్యార్థులకు సాయి పవర్ అండ్ ఎక్విప్మెంట్స్, క్లైర్ కంపెనీల ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగ అవకాశాలు పొందడం ఆనందదాయకమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీ మోహన్, డాక్టర్ జగదీష్ కే మద్దినేని ఒక ప్రకటనలో తెలిపారు. కెమికల్ విభాగం నుంచి 9 మంది, మెకానికల్ విభాగం నుంచి ఇద్దరు విద్యార్థులు రూ. 2.4 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను శుక్రవారం తమ కళాశాల సిబ్బంది అభినందించినట్లు తెలిపారు. తమ కళాశాలలో విద్య నభ్యసిస్తున్న ప్రతి విద్యార్థికి ఉన్నతమైన భవిష్యత్తును అందించడమే తమ లక్ష్యమని కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టరు కొండబోలు కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు కొల్లా శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

12న పౌరాణిక పద్యగాన పోటీలు

మంగళగిరి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పాతమంగళగిరి పద్మశాలీయ బహూత్తమ సేవా సంఘం (కల్యాణ మండపం) ఆధ్వర్యంలో ఈ నెల 12న శ్రీ భద్రావతీ సమేత భావనారుషి స్వామివారి పవళింపు సేవ సందర్భంగా పౌరాణిక కళాకారులకు పద్యగాన పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని విశ్వశాంతి కళా పరిషత్ కన్వీనర్ పొట్లాబత్తుని లక్ష్మణరావు తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సాహితీ కళావేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు, బాలకృష్ణ పాల్గొన్నారు.

11 నుంచి ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో హ్యాపీనెస్ ప్రోగ్రాం

తాడేపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ ఎయిర్ బ్రీత్ హ్యాపీనెస్ కార్యక్రమం ఫిబ్రవరి 11 నుంచి ఆరు రోజుల పాటు స్థానిక ఎఎస్ఆర్ నాచురల్ ఫామ్స్‌లో జరగనున్నట్లు నిర్వాహకులు మేకా శ్రీధర్‌రెడ్డి, ఇట్టా భాస్కర్‌లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు మొదటి బ్యాచ్, సాయంత్రం 6.30 గంటల నుంచి రెండో బ్యాచ్ జరుగుతుందని పేర్కొన్నారు. ఆందోళన, ఉద్రిక్తతలు, ఒత్తిడి, భయం, హ్యాపీనెస్, రిలాక్సేషన్, శాంతి, విశ్వాసం, మనసులో స్పష్టత, ఫోకస్ బెటర్ హెల్త్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు

ముగిసిన గణపతి స్వామి బ్రహ్మోత్సవాలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్వీఎన్‌కాలనీలోని శ్రీ విజయ గణపతి స్వామి వారి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో వైభవంగా ముగిసాయి. చివరి రోజున ఉదయం ప్రాతఃకాల ఆరాధన, నిత్య, లక్ష్మీ సుదర్శన, పారమాత్మిక మహా శాంతి హోమాలు, బలిహరణ తదితర కార్యక్రమాలను వేద పండితులు వేదోక్తంగా నిర్వహించారు. అనంతరం చూర్ణోత్సవం , అవబృతస్నానం, యాగ పూర్ణాహుతి కార్యక్రమాలు భక్తి ప్రపత్తులతో జరిపారు. విశేష సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాలను తిలకించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.. సాయంత్రం స్వామి వారిని ద్వాదశ ప్రదక్షిణాలు, ఊంజల్‌సేవ వైభవంగా జరిపారు.



యాగ పూర్ణాహుతి చేస్తున్న వేదపండితులు

కాల్వల నిర్మాణాలు ఎప్పుడో?

● నెలలు గడుస్తున్నా శ్రీనివాసరావుపేట 60 అడుగుల రోడ్డు, అడ్డరోడ్లలో పరిష్కారం కాని సమస్యలు

గుంటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది సెప్టెంబరులో స్థానిక శ్రీనివాసరావుపేట 60 అడుగుల రోడ్డు, అడ్డరోడ్లలో ఆక్రమణల పేరుతో ఎక్కడికక్కడ కూల్చివేశారు. ఇళ్ళ ముందు కాల్వలు చేసి వది లేశారు. నెలలు గడుస్తున్నా ఆయాచోట్ల పగులగొట్టిన, రహదారులకు ఇరువైపులా కాల్వల నిర్మాణం చేపట్టడం లేదు. దీంతో, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ళల్లో నుంచి బయటకు రావాలన్నా, లోపలికి తిరిగి వెళ్లాలన్న ఇబ్బందిగా ఉందని చెబుతున్నారు. వేల రూపాయల వెచ్చించి చెక్క బల్లలు కొనుగోలు చేసి ఏర్పాటు చేసుకున్నామని, ఈవిధంగా ఎన్నాళ్లని ప్రశ్నిస్తున్నారు. ఆర్థిక స్తోమత లేని వారైతే చెక్కబల్లలు కొనుగోలు చేయలేని పరిస్థితి. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి కాల్వలు, అవసరమైన చోట కల్వర్టుల నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఆక్రమణల పేరుతో కాల్వల నిర్మాణాలను పగులగొట్టిన అధికారులు అక్రమ నిర్మాణాలు, రోడ్డుపై వరకు నిర్మించిన ర్యాంపులను తొలగించటంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని స్థానికుడైన ఆర్టీఐ కార్యకర్త కోనేటి గోవిందరావు ఆరోపించారు. స్థానికురాలు కనిగిరి స్వర్ణలత మాట్లాడుతూ రాత్రి సమయంలో చిన్నారులు, వృద్ధులు మరింత భయపడాల్సి వస్తోందని అన్నారు. అడ్డగోలుగా కాల్వలను పగులగొట్టిన వాళ్ళు తిరిగి నిర్మించకపోవడంపై దృష్టి పెట్టక పోవడం సరికాదన్నారు. కాల్వల దుర్వాసన భరించలేకపోతున్నామని, తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పరిస్థితి నెలకొంటోంది.



ఆక్రమణల కూల్చివేతతో నిలిచిపోయిన మురుగునీరు, ఇళ్ళ ముందు దారి కోసం వేసుకున్న చెక్క బల్లలు

సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి

● జీఎంసీ కమిషనర్ శ్రీనివాసులు ఆదేశాలు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ని సోమవారానికి సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై కమిషనర్ చాంబర్‌లో ఇంజినీరింగ్ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డు సచివాలయాల వారీగా నివాసాలు, కమర్షియల్ సంస్థలు, బావులు, బోర్లు, ప్రస్తుతం ఇస్తున్న సరఫరా, వేసవిని దృష్టిలో పెట్టుకొని ఇవ్వాల్సిన సరఫరా వంటి వివరాలతో సోమవారం నాటికి ఏఈల వారీగా సమగ్ర నివేదిక అందించాలని అన్నారు. నివేదిక మేరకు క్షేత్ర స్థాయి పరిశీలన చేసి, వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. డీఈఈల వారీగా ఏఈలు, ఎమినిటి కార్యదర్శులతో ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసుకుని, వాస్తవ అవసరాలకు తగిన విధంగా అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే, గతంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాల వివరాలు, ఈ ఏడాది ఏర్పాటు చేయాల్సిన పాయింట్స్ వివరాలు, సచివాలయాల వారీగా పైప్ లైన్ లకు మరమ్మతులు చేపట్టాల్సిన జాబితాను కూడా అందించాలన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రతి ఇంటికీ తాగునీటి సరఫరా నూరు శాతం జరిగేలా చూడాల్సిన బాధ్యత ఏఈలదేనని, ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎస్‌ఈ నాగమల్లేశ్వరరావు, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, డిఈఈలు నాగభూషణం, కళ్యాణరావు, మధుసూదన్, రమేష్ బాబు, సతీష్ కుమార్, శ్రీనివాస్, ఇంజనీరింగ్ సెక్షన్ సూపరిండెంట్ రాజశేఖర్, ఏఈలు పాల్గొన్నారు.



మణిపురం బ్రిడ్జి వద్ద పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలి

నగరంలో ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలని, మధ్యాహ్నం సమయంలో గ్యాంగ్ వర్క్ లు తప్పనిసరిగా చేపట్టాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. స్థానిక నల్లచెరువు, సంపత్ నగర్, ఇజ్రాయిల్ పేట తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఆయా చోట్ల జరుగుతున్న అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించారు. తనిఖీ చేసి తీసుకోవాల్సిన చర్యలపై ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ మైక్రో పాయింట్స్ మేరకు వార్డు సచివాలయ పరిధిలో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. కార్మికులు ఉదయం మస్టర్ అనంతరం మెయిన్ రోడ్లు స్వీపింగ్ చేసి, ఇంటింటి చెత్త సేకరణ చేయాలన్నారు. మధ్యాహ్నం సమయంలో డివిజన్ పరిధిలో సమస్యాత్మక ప్రాంతాలను, డ్రెయిన్లను గ్యాంగ్ వర్క్ ద్వారా శుభ్రం చేయించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో డీఈఈ మధుసూదన్ , ఆర్‌ఓ సాదిక్ బాష, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఐటీ కంపెనీల ఏర్పాటుకు అద్దె భవనాలు కావాలి

ఐటీ కంపెనీల ఏర్పాటు నిమిత్తం గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 5 వేల చదరపు అడుగులు కలిగిన భవనాలు అద్దెకు కావాలని, ఆసక్తి కలిగిన భవన యజమానులు ఈ నెల 10 నుంచి కమిషనర్ చాంబర్‌లో సంప్రదించాలని పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం పారిశ్రామికంగా, ఐటీ పరంగా పలు సంస్థలను ఆహ్వానిస్తోందని, అందులో భాగంగా గుంటూరు జిల్లా కేంద్రంలో కూడా ప్రత్యేకంగా భవనాలు అవసరమని పేర్కొన్నారు. అద్దె ప్రాతిపదికన భవనాలు తీసుకోవడానికి ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన యజమానులు తమ భవనానికి సంబంధించిన చిరునామా, అంతస్తుల వివరాలు, అద్దెకు ఇవ్వాలనుకున్న భవన విస్తీర్ణం, నిర్మాణం జరిగిన ఏడాది వంటి సమగ్ర వివరాలతో కమిషనర్ చాంబర్‌లో సిటీ ప్లానర్ డీ రాంబాబు (9849908390), చాంబర్ సూపరిండెంట్ ఎస్ఎన్ ప్రసాద్ (9866337509)కు అందించాలని కోరారు. ఆమోదించిన భవనాలకు ప్రభుత్వ నిర్దేశిత మార్గదర్శకాల మేరకు అద్దె చెల్లింపు జరుగుతుందని తెలిపారు.

నిర్దిష్ట గడువు లోగా పనులు పూర్తి చేయాలి

అభివృద్ధి పనులకు టెండర్ ద్వారా వర్క్ ఆర్డర్ పొందిన కాంట్రాక్టర్లు నిర్దేశిత గడువు మేరకు ఆయా పనులను పూర్తి చేయాలని, గడువు ప్రకారం చేయని పనులను రద్దు చేస్తామని కమిషనర్ శ్రీనివాసులు స్పష్టం చేశారు. కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులతో నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై జీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో శుక్రవారం సంయుక్త సమావేశం ఏర్పాటు చేశారు. కాంట్రాక్టర్ల వారీగా టెండర్ పొందిన పనులు, పెండింగ్ పనుల వివరాలను కాంట్రాక్టర్లను, అధికారులను అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ జీఎంసీ ఆర్థిక వెసులుబాటు మేరకు జరుగుతున్న అభివృద్ధి పనుల దృష్ట్యా సాధారణ నిధులు, సీఎఫ్ఎంఎస్ ద్వారా బిల్లుల చెల్లింపు జరుగుతున్నట్లు చెప్పారు. తాగునీటి సరఫరా, వీధి దీపాలు, ప్యాచ్ వర్క్‌కు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎస్‌ఈ నాగమల్లేశ్వరరావు, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, డిఈఈలు, ఏఈలు, కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొండా రమేష్, కుంచాల శివనాగేశ్వరరావు, జైరాం రెడ్డి, వెంకట్రావు, విష్ణువర్ధనరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ప్రభాకర్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

పెన్షనర్లు, వేతనజీవులకు వెతలు

గుంటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వేతన సవరణ సంఘం సిఫార్సులు అమలులో, కమిషన్ రిపోర్టు ఇవ్వడంలో ప్రతిసారి జాప్యం జరగటంతో పెన్షనర్లు, వేతన జీవులను నిరీక్షణకు గురిచేస్తుందని రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో ఆరోపించారు. వేతన సవరణ సంఘం ఏర్పాటు తరువాత సిఫార్సుల అమలులో ప్రతిసారి తీవ్ర జాప్యం జరుగుతుండటంతో ఉద్యోగులు, పింఛన్ దారులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారన్నారు. పీఆర్‌సీ అమలు చేసేదాకా 20 శాతం ఐఆర్ వెంటనే చెల్లించాలని కోరారు. ప్రభుత్వం నియమించిన 12వ పీఆర్‌సీ ఈ ఏడాది జూలై నుంచి అమలు కావాల్సి ఉండగా ఇప్పటికీ కమిటీకి కావాల్సిన సిబ్బందిని నియమించలేదన్నారు. కొత్త పీఆర్‌సీ పని ప్రారంభించి దాని సిఫార్సు ఇచ్చేందుకు కనీసం ఏడాది పడుతుందన్నారు.

ఇంత జాప్యాన్ని భరించే స్థితిలో ఉద్యోగులు, పెన్షన్ దారులు లేరన్నారు. జిల్లాలో 56 ప్రభుత్వ శాఖల పరిధిలో సుమారు 50 వేల మంది ఉద్యోగులు 40 వేల మంది పెన్షన్‌దారులు ఉన్నారన్నారు. ప్రస్తుతం అమలు చేయా ల్సిన పీఆర్‌సీ వాస్తవంగా జూలైలోనే అమలు చేయాల్సి ఉండగా, ప్రభుత్వం అమలు కమిటీనే నియమించలేదన్నారు. దీని వల్ల ఉద్యోగులు పెన్షన్‌దారులు గతంలో కూడా 18 నెలలు ఆర్థిక ప్రయోజనం కోల్పోయారన్నారు. పెరిగిన ధరల కారణంగా ప్రస్తుతం ఇస్తున్న జీతాలు, పెన్షన్‌లు చాలటం లేదని, ఆరోగ్యం కాపాడుకోవటానికే సగం సొమ్ము ఖర్చవుతుందన్నారు. ఆరోగ్యం బాగుంటేనే విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ సొమ్ము సరిపోతుందన్నారు.

మెడికల్ లీవ్‌లు, ఎన్‌క్యాష్‌మెంట్, ప్రసూతి సెలవులు, అప్రంటీస్ సర్వీస్‌ను పింఛన్‌కు అర్హదాయక సర్వీసుగా పరిగణించటం మెడికల్, అంత్యక్రియల అలవెన్స్ పెంపు తదితర ప్రయోజనాల కోసం ఉద్యోగులు ఎదురు చూస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీకి తగినంత సిబ్బందిని నియమించి కమిషన్ సిఫార్సులను ఆమోదించి కొద్ది నెలలోనే పింఛన్‌దారులకు ,ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలంటే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని వీరయ్య కోరారు.

పురస్కారాలు కవులను ప్రోత్సహిస్తాయి

● గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు గోనుగుంట్ల

గుంటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పురస్కారాలు కవులను ప్రోత్సహిస్తాయని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలోని అన్నమయ్య కళా వేదికపై రావి రంగారావు సాహిత్య పీఠం శుక్రవారం జనరంజక కవి ప్రతిభా పురస్కారాలు అందజేసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సభకు ప్రముఖ విద్యావేత్త గద్దె మంగయ్య అధ్యక్షత వహించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ దారి తప్పుతున్న సమాజాన్ని దారిలోకి తీసుకువచ్చే లక్ష్యం కవులకు ఉంటుందని అన్నారు. పదకొండు ఏళ్లుగా జనానికి పనికొచ్చే కవులను గుర్తించి వారికి పుర స్కారాలను అందజేస్తున్న రావి రంగారావు సాహిత్య పీఠం కృషిని ఆయన ప్రశంసించారు. అనంతరం రాజమండ్రి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టరు తరపట్ల సత్యనారాయణ మాట్లాడారు. పీఠం వ్యవస్థాపకుడు డాక్టరు రావి రంగారావు పురస్కారాల నేపథ్యం గురించి వివరిస్తూ.. మార్మిక ధోరణులు కాకుండా జన రంజక స్పష్ట గంభీర భావయుక్త కవిత్వం అవసరాన్ని గుర్తించి ఈ ప్రతిభా పురస్కారాలు ఇస్తున్నట్లు తెలిపారు. పోటీకి వచ్చిన వందకు పైగా కవిత్వ గ్రంథాలలో ఎంపికైన నాలుగు పుస్తకాల కవులకు పురస్కారాలు అందజేశారు. 'నాన్న ఎందుకో వెనక బడ్డాడు' కవి ప్రకాశ్ నాయుడును, 'అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి' కవి లేదాళ్ల రాజేశ్వరరావును, 'గాజా లేని గాజా' కవి నేలపూరి రత్నాజీని అతిథులు శాలువాలతో, జ్ఞాపికలతో, రెండు వేల రూపాయల చొప్పున నగదు ఇచ్చి ఘనంగా సత్కరించారు. 'పుష్ప మంజరి' పద్యాల సంపుటి రాసిన గుమ్మా నాగమంజరి పక్షాన రాజ్యలక్ష్మి పుర స్కారం అందుకున్నారు. ఎంపికైన పుస్తకాల గురించి గడల శివ ప్రసాద్ పరిచయం చేశారు. కార్యక్రమంలో పీఠం డైరెక్టరు డాక్టర్ రావి అరుణ, డాక్టర్ మైలవరపు లలిత కుమారి పీఠం కన్వీనర్ నర్రా ప్రభావతి,తొలుత దేవాలయ పాలక మండలి అధ్యక్షుడు మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ తదితరులు

ఘనంగా కేఎల్‌పీ క్రీడా వార్షికోత్సవం

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పాఠశాలలో శుక్రవారం 40వ క్రీడా వార్షికోత్సవ ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆట,పాటల్లో ముందు ఉండాలని సూచించారు. ఏదో ఒక ఆట నేర్చుకుని అందులో నైపుణ్యం సాధిం చాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ రత్తయ్య, ఏఓ కె.వెంకట్రావ్ అకడమిక్ కోఆర్డినేటర్ బి. శైలజ పాల్గొన్నారు.

రోడ్లు ఇలా! వాహనం నడిచేదెలా?

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గతుకుల రోడ్లు, గత ప్రభుత్వ చేదు జ్ఞాపకాలు. వాటిని చెరిపేసి ప్రజలకు సుపరిపాలన తాలూకు ఫలాలను అందించాలన్నది ప్రస్తుత ప్రభుత్వ ఉద్దేశం. అయితే, రోడ్లు, భవనాల శాఖ అధికారుల నిర్లిప్తత, పనులు గుర్తింపులో చోటుచేసుకున్న నిర్లక్ష్యం సమోన్నత లక్ష్యా లకు శాపగ్రస్తంగా మారింది. అందుకు ఉదాహరణలు ఈ రహదారులే. స్థానిక హౌసింగ్ బోర్డు నుంచి గుంటూరు రూరల్ మండలంలోని అంకిరెడ్డిపాలెం వెళ్లే రోడ్డు, నల్లపాడు నుంచి విజయవాడ వైపు వెళ్లే హైవే కి వెళ్లే రోడ్డు అధ్వానస్థితిలో ఉన్నాయి. అంకిరెడ్డిపాలెం వెళ్లే రోడ్డు గుంతల మయం కావడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. నల్లపాడు నుంచి హైవే కి వెళ్లే బైపాస్ రోడ్డులో అయితే మోకాలు లోతు గుంతలు ఉన్నాయి. ఆయా మార్గాల్లో ప్రయాణించే వాహనచోదకులకు ఇబ్బందులు తప్పట్లేదు. టీడీపీ కూటమి ప్రభుత్వంలో అయినా ఆయా రోడ్లు బాగుపడతాయని స్థానికులు, వాహనచోదకులు భావించారు. ప్రభుత్వం నియమించిన గడువు ముగిసినా ఆ రోడ్ల జోలికి అధికారులు వెళ్లక పోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఆయా రోడ్లను సంబంధిత శాఖాధికారులు ఎలా మర్చిపోయారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న రోడ్ల విషయంలో ఆర్అండ్‌బీ అధికారులు ఇంత బాధ్యతగా ఉంటే ఇంక గ్రామీణ ప్రాంతాల్లో వాటి విషయంలో ఏపాటి శ్రద్ధ ఉందో అర్థం చేసుకోవచ్చునని వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. ఆయా రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



హౌసింగ్ బోర్డు నుంచి అంకిరెడ్డి పాలెం వెళ్లే రోడ్డుపై గోతులు





నల్లపాడు నుంచి విజయవాడ హైవే కు వెళ్లే బైపాస్ రోడ్డు లో ఉన్న ప్రమాదకరమైన గోతులు



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు, పాల్గొన్న దంపతులు

వైభవంగా సప్తాహ మహోత్సవాలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేట, ఓంకారక్షేత్రంలో శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం గాయత్రీమాత, భువనేశ్వరి అమ్మ వార్లకు కుంకుమార్చనలు నిర్వహించారు. స్వామివార్ల కల్యాణాలలో భాగంగా శ్రీ పద్మావతి ఆండాళ్ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ కనులపండువగా నిర్వహించారు. అనంతరం ముత్యాల తలంబ్రాలు, మంత్ర పుష్పాలు భక్తులకు అందజేశారు. సాయంత్రం శ్రీమద్రామాయణ ప్రవచనంలో మంచికంటి వెంకట సత్యవతి అరణ్యకాండలోని విశేషాలను వివరించారు. కార్యక్రమా లను కార్యదర్శి నంబూరు వేంకట శ్రీమన్నారాయణమూర్తి పర్యవేక్షించారు.

విజయకీలాద్రిలో శ్రీనివాసునికి చక్రస్నానం

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంలో శుక్రవారం 8వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. వేద విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ ఉత్సవాలు నిర్వహించారు. తొలుత వెంకటేశ్వరస్వామికి అవభృద స్నానము, కృష్ణానదిలో చక్రతీర్థం వైభవంగా నిర్వహించారు. అనంతరం ప్రోక్షణ శ్రీ పుష్పయాగం, ద్వాదశారాధన, మహా పూర్ణాహుతి, వేదాశీర్వాచనంతో అంగరంగ వైభవంగా ఉత్సవ కార్యక్రమం జరిగింది. చినజీయర్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు, అనంతస్వామి, వేదవిద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.



ఉత్సవాలను ప్రారంభిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక గోరంట్ల వేంకటేశ్వర స్వామి దేవస్థాన సొసైటీ ఆధ్వ ర్యంలో 23వ వార్షిక బ్రహ్మోత్స వాలు శుక్రవారం ఘనంగా ప్రారంభ మయ్యాయి. వేద పండితులు అంకురార్పణ చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం స్వామి వారికి విశేషాభిషేకాలు, అర్చనలు జరిగాయి. అనంతరం భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

కార్య క్రమాలను ఆలయ కమిటీ ఛైర్మన్ కంచర్ల ఆంజనేయులు, అధ్యక్షుడు ఎర్రంశెట్టి వేణుగోపాల్ తదితరులు పర్యవేక్షించారు. ఉత్స వాల్లో భాగంగా శనివారం ధ్వజా రోహణ, గజవాహన సేవ జరుగుతాయని అర్చకులు తెలిపారు.

'చార్వాక' సంస్కృతే వేరు!

● తొలినాళ్లలో విద్యాపీఠంగా ఎందరికో జ్ఞానబోధ
● నాస్తిక, హేతువాద భావాలతో జన చైతన్యం
● నేడు, రేపు నాస్తిక మేళా



నిడమర్రులోని చార్వాక ఆశ్రమం

గుంటూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఏ మతానికి చెందిన వారైనా భావవాదులు ఓ వైపు.. దానికి ప్రత్యామ్నాయంగా నాస్తిక వాదులంతా ఓ వైపు నిలిచారు. మతంపై, దాని తాలూకూ విశ్వాసాలపై పోరాడుతున్న నాస్తిక, హేతువాదులకు వేదికగా సరిగ్గా 52 ఏళ్ల క్రితం చార్వాక విద్యాపీఠం ఏర్పాటైయింది. ప్రత్యామ్నాయ తాత్విక చింతనను ఆలవాలంగా, రెండు తెలుగు రాష్ట్రాల్లో బలమైన వేదికగా ఈ చార్వాక విద్యా పీఠం ఏర్పాటైయింది.

● 1972లో ఏర్పాటైన విద్యాపీఠం

1972లో చార్వాక ఆశ్రమం ఏర్పడింది. తాడికొండ సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న బొడ్డు రామకృష్ణ మాస్టారు ప్రత్యామ్నాయ సంస్కృతివ్యాప్తిలో భాగంగా ఆశ్రమాన్ని ఏర్పాటుచేశారు. 1973లో మంగళగిరి మండలం నిడమర్రు గ్రామం లో విశాలమైన ప్రాంగణంలో ఆశ్రమాన్ని ఏర్పాటుచేశారు. భౌతికవాద విద్యా వ్యాప్తి కోసం ప్రిన్సిపాల్ పదవికి రాజీనామా చేసి 1974లో 'ప్రగతి విద్యావనం' పేరుతో చా ర్వాక విద్యాపీఠాన్ని ఏర్పాటుచేశారు. 2005 వరకూ విద్యాపీఠాన్ని నడిపారు. సొంతంగా సిలబస్‌ను రూపొందించుకుని విద్యా బోధన చేశారు. ఆయన వద్ద చదువుకున్న ఎంతోమం ది విద్య, వైద్య, రాజకీయరంగాల్లో ప్రముఖులుగా ఎదిగారు. దళిత ఉద్యమనేత కత్తి పద్మారావు కూడా తొలినాళ్లలో రామకృష్ణ మాస్టారు శిష్యుడిగా విద్యార్జన చేశారు.


ఆశ్రమ వ్యవస్థాపకుడు రామకృష్ణ మాస్టారు

● ఆశ్రమంలో భౌతికవాదుల సంస్కృతులు ఎన్నో..

53 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో చార్వాక ఆశ్రమం కేవలం నాస్తిక, హేతువాద భావాలకే పరిమితం కాలేదు. అది ఎన్నోరకాల తాత్విక చింతనలు, భావాల వ్యాప్తికి నిలయంగా నిలిచింది. 'సాంఘిక, ఆర్థిక పోరాటాలు బొమ్మాబొరుసులు' అన్న నినాదంతో ఎన్నోరకాల సామాజిక ఉద్యమాలు, అణగారినవర్గాల అస్తిత్వ ఉద్యమాలు, పీడిత ప్రజల విముక్తి పోరాటాలు, విప్లవభావాలు, ద్రవిడ సంస్కృతి, సంప్రదాయాల వ్యాప్తికి ఆశ్రమం వేదికగా నిలిచింది. వామపక్ష, ప్రజాతంత్ర, విప్లవ శ్రేణులన్నింటితోనూ ఆయన మమేకమయ్యారు.

● తొలితరం శాస్త్రవేత్తలు..

చరిత్రపుటల్లో స్థానం కోల్పోయిన తొలితరం భౌతిక శాస్త్రవేత్త(సైంటిస్టు)లంతా ఇక్కడ కనిపిస్తారు. కణ శాస్త్రం పై వేల సంవత్సరాల క్రితం చెప్పిన కపిలుడు, కణాదుడు, అసిత కేశకంబళుడు, మక్కలి గోశాలుడు, పూర్ణ కశ్యపుడు, సాంఖ్య, శూద్రకుడు వంటి చరిత్రను మలిచిన ఎందరో శాస్త్రవేత్తలు ఇక్కడ విగ్రహాల రూపంలో నేటితరాన్ని పలకరిస్తుంటారు. బుద్ధుడు, మహాత్మా జ్యోతిరావ్‌పూలే, సావిత్రిబాయిపూలే, బీఆర్ అంబేద్కర్ విగ్రహాలు కన్పిస్తాయి.

● దేశంలో ఎక్కడా కనిపించని వేమన ఇక్కడ..

వేమన అనగానే దిగంబరుడిగా ఉన్న చిత్రాలు గుర్తుకువస్తాయి. కానీ ఇక్కడ ఏర్పాటుచేసిన వేమన విగ్రహం చాలా ప్రత్యేకమైనది. చార్వాక ఆశ్రమం స్వాగత ద్వారం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఈ విగ్రహాన్ని రామకృష్ణ మాస్టారు ఎంతో ప్రత్యేకంగా రూపొందించారు. పంచెకట్టులో కనిపించే ఈ విగ్రహం చార్వాక ఆశ్రమ ఔన్నత్యానికి మకుటాయమానంగా నిలుస్తోంది.

● నాస్తికుల పండగ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని భౌతికవాదులందరికీ ఒక పండగగా నాస్తిక మేళాను నిర్వహిస్తున్నారు. ఇప్పటికి 33 ఏళ్లుగా ఈ నాస్తిక మేళా జరుగుతోంది. 2007లో రామకృష్ణ మాస్టారు చనిపోయినప్పటి నుంచి ఆయన వారసులు మేళాను కొనసాగిస్తున్నారు. ప్రతి ఏటా ఫిబ్రవరి రెండో శని, ఆదివారాల్లో ఈ మేళా జరుగుతుంది. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా నాస్తికులు, భౌతికవాదులు వారి కుటుంబసభ్యులతో కలిసి ఈ వేడుకల్లో పాల్గొంటారు.


తొలితరం సైంటిస్టులు కపిలుడు, కణాదుడు, అసితుడు, మక్కలి

ఉల్లాసంగా.. విజ్ఞానోత్సవ్

● సందడి చేసిన సినీ తారలు
● ఆకట్టుకున్న క్రీడా, సాంస్కృతిక పోటీలు

మాట్లాడుతున్న సినీ హీరో విశ్వక్‌సేన్




ఖోఖోలో పోటా పోటీగా..


కబడ్డీలో...

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): యువతీ, యువకులు చేస్తున్న సందడితో విజ్ఞాన్ మహోత్సవ్ శుక్రవారం ఉత్సాహంగా, ఉల్లాసంగా సాగింది. ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ ఆచార్య పి.నాగ భూషణ్ మాట్లాడుతూ ఆటల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం వలన జిజ్ఞాస, సమర్థ, సమయ పాలన, బుద్ధి స్థిరత్వం, వేగంగా సంగ్రహించుకోవడం ఇలా ఎన్నో అంశాలు అభివృద్ధి చెందుతాయన్నారు.

'లైలా' సినిమా యూనిట్ సందడి

విద్యార్థులందరూ మీ మనసు చెప్పిందే వినాలని సినీ హీరో, డైరెక్టర్, స్క్రీన్ రైటర్ విశ్వక్‌సేన్ అన్నారు. యువత తమలో అంతర్లీనంగా ఉన్న నైపుణ్యాలు వెలికి తీయడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ సందర్భంగా 'లైలా' సినిమా యూనిట్ సందడి చేసింది. హీరో విశ్వక్‌సేన్ మాట్లాడుతూ ఈ నెల 14న సినిమా ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందన్నారు. మొట్టమొదటి సారిగా లైలా అనే అమ్మాయి పాత్రధారణలో నటించానని పేర్కొన్నారు. అనంతరం లైలా సినిమా యూనిట్ విద్యార్థులతో సెల్ఫీలు దిగారు.

పోటాపోటీగా..

జాతీయ స్థాయి విజ్ఞాన మహోత్సవ్‌లో భాగంగా నిర్వహిస్తున్న పోటీల్లో విద్యార్థులు నువ్వా నేనా అన్నట్లు పోటీ పడ్డారు. అథ్లెటిక్స్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, చెస్ పోటీలను నిర్వహించారు. జానపద, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఓలలాడించాయి. వీటితోపాటు మ్యూజిక్, లిటరరీ, స్పాట్‌లైట్, డాన్స్, డ్రమాటిక్స్ అండ్ ఫిల్మ్ మేకింగ్, ఫ్యాషన్, ఫైన్ ఆర్ట్స్, కల్చరల్స్, థియేటర్ ఆర్ట్స్ పోటీల్లో విద్యార్థులు సత్తా చాటారు. విజ్ఞాన్ మహోత్సవ్‌లో భాగంగా శనివారం జరిగే ముగింపు కార్యక్రమానికి ఇండియన్ ఫిల్మ్ డైరెక్టర్, స్క్రీన్ రైటర్ కే.ఎస్.రవీంద్ర (బాబీ), 2024 పారాలింపిక్స్ బ్రాంజ్ మెడలిస్ట్, ఇండియన్ పారా పిస్టల్ షూటర్, అర్జున అవార్డీ రుబీనా ఫ్రాన్సిస్ హాజరు కానున్నట్లు వీసీ వెల్లడించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘు నాథన్ పాల్గొన్నారు.




శాస్త్రీయ నృత్యం చేస్తున్న విద్యార్థినులు


నృత్యం చేస్తున్న విద్యార్థిని

అట్టహాసంగా ఆలపాటి నామినేషన్

● జనసంద్రంగా గుంటూరు నగరం
● మూడు పార్టీల నేతలతో ప్రదర్శనగా కలెక్టరేట్‌కు
● సంఘీభావంగా ఉమ్మడి కృష్ణాజిల్లా నేతలు


నామినేషన్‌కు ప్రత్యేక వాహనంలో వెళ్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్, మంత్రి మనోహర్, ఎమ్మెల్యేలు మాధవి, నజీర్, కామినేని శ్రీనివాస్ తదితరులు

గుంటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు-కృష్ణా జిల్లాల పట్టభద్రుల శాసన మండలి స్థానానికి పోటీ చేస్తున్న ఎన్డీఏ కూటమి అభ్యర్థి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ నామినేషన్ ప్రక్రియ అట్టహాసంగా జరిగింది. మూడు పార్టీల శ్రేణులు వేలాదిగా తరలి రావడంతో గుంటూరు నగరం జనసంద్రంగా మారింది. శుక్రవారం ఉదయం గుంటూరు వెంకటేశ్వరా విజ్ఞాన మందిరం నుంచి తెలుగు తమ్ముళ్లు, జనసైనికులు, బీజేపీ శ్రేణులు కదం తొక్కారు. యువనేతలు, కార్యకర్తలు నగరంలో బైకు ర్యాలీ నిర్వహించారు. న్యాయవాదులు ఆలపాటికి సంఘీభావం ప్రకటించి ర్యాలీలో భాగమయ్యారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర కార్పొరేషన్ల ఛైర్మన్లు మొదలు సాధారణ కార్యకర్త వరకూ ప్రదర్శనలో అగ్రభాగాన నిలిచారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి నాదెండ్ల మనోహర్, కృష్ణా జిల్లాకు చెందిన మంత్రి కొలుసు పార్థసారథి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మాజీ మంత్రులు, రాష్ట్ర శాసన సభ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, కామినేని శ్రీనివాసరావు, తెనాలి శ్రావణ్ కుమార్, గళ్లా మాధవి, మొహమ్మద్ నసీర్, జూలకంటి బ్రహ్మారెడ్డి, ప్రత్తిపాటి పుల్లారావు, భాష్యం ప్రవీణ్, వేగేశ్న నరేంద్రవర్మ, అరవిందబాబు, కుమార రాజా, ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు, కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, జెడ్పీ ఛైర్మన్ హెనీ క్రిస్టినా, పలు కార్పొరేషన్ల ఛైర్మన్లు ఆలపాటికి తోడుగా నిలిచి ప్రదర్శనగా ఆయన్ను గుంటూరు కలెక్టరేట్‌కు తీసుకుపోయారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరా విజ్ఞాన మందిరంలో మూడు పార్టీల నేతలు చేతులు కలిపి తమ ఐక్యతను చాటారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ కూటమి పిలుపులో భాగంగా జనసేన ఆలపాటికి అన్ని విధాలా అండగా నిలుస్తుందని చెప్పారు. మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ బీజేపీ శ్రేణులు ఆలపాటి గెలుపునకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తాయన్నారు. ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ధర్మం ప్రకారం తెనాలి సీటును ఆలపాటి త్యాగం చేశారని గుర్తుచేశారు. ప్రదర్శనలో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టం రఘురామ్, ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ, ఏపీఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్, లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీడీపీ జోన్- 5 ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర, మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ, బీజేపీ నేత వల్లూరి జయప్రకాశ్, జనసేన రాష్ట్ర నేత బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, టీడీపీ సీనియర్ నాయకుడు మన్నవ సుబ్బారావు, చిట్టాబత్తిన చిట్టిబాబు, తాడిశెట్టి మురళి, కనపర్తి శ్రీనివాసరావు, కసుకుర్తి హనుమంతరావు, మన్నవ వంశీకృష్ణ, రావిపాటి సాయికృష్ణ, నన్నపనేని రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

తరలివచ్చిన నేతలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరు-కృష్ణా ఉమ్మడి జిల్లాల కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. గుంటూరు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మికి రెండు సెట్ల నామినేషన్ పత్రాలు అందజేశారు. నామినేషన్ సందర్భంగా కలెక్టరేట్ ఎదుట భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. పోలీసు ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. నామినేషన్ అనంతరం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆలపాటి నామినేషన్‌కు పెద్దఎత్తున కార్యకర్తలు రావడం సంతోషంగా ఉందన్నారు. మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ఇప్పుడిప్పుడే వ్యవస్థలు గాడిలో పడుతున్నాయని ఈ సమయంలో ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆలపాటి రాజేంద్రప్రసాదు మాట్లాడుతూ 33 నియోజకవర్గాల పరిధిలోని పట్టభద్రుల సమస్యలపై పోరాటం చేయడానికి కూటమి అవకాశం కల్పించిందని సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పామర్రు ఎమ్మెల్యే వర్ల రాజా, గళ్లా మాధవి, ఎమ్మెల్యే నరేంద్రవర్మ, తెనాలి శ్రావణ్ కుమార్, యరపతినేని శ్రీనివాసరావు, నజీర్ అహమ్మద్, నక్కా ఆనంద్ బాబు, టీడీపీ సీనియర్ నాయకులు నెట్టెం రఘురాం మాట్లాడుతూ ఆలపాటి గెలుపులో నాయకులు కీలక పాత్ర పోషించాలని కోరారు.


ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ నామినేషన్ వేస్తున్న సందర్భంగా సంఘీభావం తెలియజేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, నక్కా ఆనందబాబు, గళ్లా మాధవి, నసీర్, కామినేని శ్రీనివాస్, జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, జనసేన నాయకులు బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, వెంకటేశ్వరరావు తదితరులు

సకల జనులకు ఆశీర్వాదకర జీవితం

● డాక్టర్ జె.ప్రమీలా సెల్వరాజ్‌కి ఘన నివాళి


జ్ఞాపకార్థ ప్రార్థనలో ప్రసంగిస్తున్న కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

పెదకాకాని, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బైబిలు మిషను స్త్రీల సభల కన్వీనర్, రెండో శనివారం ఉపవాస ప్రార్థనల వ్యవస్థాపక నిర్వాహకురాలు డాక్టర్ జె.ప్రమీలా సెల్వరాజ్ జ్ఞాపకార్థ కూడిక శుక్రవారం పెదకాకాని స్వస్థిశాలలో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి బైబిలు మిషను వైస్ ప్రెసిడెంట్ పి.జాన్ దేవదాసు అధ్యక్షత వహించారు. తొలుత ప్రార్థనలు, కీర్తనలు, వాక్యపఠన జరిగాయి. అనంతరం ముఖ్యవక్తలుగా హాజరైన పలువురు డాక్టర్. జె.ప్రమీలా సెల్వరాజ్‌తో ఉన్న గత స్మృతులను విశ్వాసులకు వివరించారు.

బైబిలు మిషను వ్యాప్తిలో...

దేశ, విదేశాలలో బైబిలు మిషను వ్యాప్తికి, ప్రజలందరికీ దేవుని సువార్తను చేరువ చేయడంలో డాక్టర్. జె.ప్రమీలా సెల్వరాజ్ కృషి విలువైనదని మాజీ కేంద్ర సహాయ మంత్రి జేడీ శీలం అన్నారు. ప్రమీలమ్మతో ఆయనకున్న ఆత్మీయ పరిచయ, సంఘటనలను వెల్లడించారు. మోకాళ్ల ప్రార్థన అనుభవంతో ఎంతో మందికి ఆశీర్వాదాలు అందించే ఆత్మీయ తల్లిగా ఎదిగారని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత ఓ.ఎస్.డి. ఆచార్య ఎన్.శామ్యూల్ అన్నారు. కార్యక్రమంలో ఏపీ సీపీడీసీఎల్ డైరెక్టర్ జయ భారతరావు, కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పాస్టర్ మథ్యూస్, యూపీఎఫ్ వ్యవస్థాపకులు రవి ప్రసాద్, వినీత, లాయర్ సురేష్, యశోద హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ చినబాబు, ప్రమీలారాణి, యూపీఎఫ్ ప్రెసిడెంట్ జోసెఫ్, బైబిలు ప్రొఫెసర్ శాంత సుధాకర్, హైదరాబాదు బైబిలు మిషను పాస్టర్ జాన్ క్రిష్టాఫర్ తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. అనంతరం ప్రమీలా సెల్వరాజ్ కుటుంబ సభ్యులు దాసరి దేవరాజు వందన సమర్పణ చేశారు. బైబిలు మిషను సెక్రటరీ కోట్ల ప్రశాంత్ కుమార్ ముగింపు ప్రార్థన, బైబిలు మిషను ఉపాధ్యక్షుడు పి.జాన్ దేవదాసు ఆశీర్వాదాలతో జ్ఞాపకార్థ కూడిక ముగిసింది. కార్యక్రమంలో బైబిలు మిషను అధ్యక్షుడు, కాకాని స్వస్థిశాల నిర్వాహకులు, కుమారులైన జె.శామ్యేల్ కిరణ్, జాయింట్ సెక్రటరీలు డి.సుధాకర్, ఆగమనరావు, రవి, గవర్నింగ్ బాడీ సభ్యులు, యాజకులు, సేవకులు, అభిమానులు పాల్గొన్నారు.

11 నామినేషన్‌ల దాఖలు

● కోలాహలంగా గుంటూరు కలెక్టరేట్
● ఇక మిగిలింది చివరి రోజైన 10వ తేదీ మాత్రమే

గుంటూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం ఎన్నికలకు శుక్రవారం రోజున 11మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లు చివరి రెండురోజులు కావడంతో శుక్రవారం పెద్దసంఖ్యలో అభ్యర్థులు, వారి మద్దతుదారులు గుంటూరు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. దీంతో కలెక్టరేట్ పరిసరాలు, ప్రాంగణం లోపల కోలాహలంగా మారింది. పోలీసులు కలెక్టరేట్ గేటు వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేసి కేవలం అభ్యర్థులు, వారి పేరుని ప్రతిపాదించే, బలపరిచే ఓటర్లను మాత్రమే లోనికి అనుమతించారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు అందుబాటులో ఉండి నామినేషన్లను అభ్యర్థుల నుంచి స్వీకరించారు. శుక్రవారం ఎన్‌డీఏ కూటమి బలపరిచిన ఆలపాటి రాజేంద్రప్రసాద్, కందుల వెంకటరావు, చుండూరు సత్య బాలసుందరరామశర్మ, లగడపాటి వేణుగోపాల్, జాలాది అనిల్‌కుమార్, జూపూడి శ్యాంప్రసాద్, యెండ్రెడ్డి శివారెడ్డి, మంత్రి బాలకృష్ణ, మేరిగ మోహనరావు, మురకొండ చంద్రశేఖర్, గంటా మమత నామినేషన్లు దాఖలు చేశారు. కాగా శని, ఆదివారం ప్రభుత్వ సెలవుదినాలు కావడంతో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నామినేషన్లను స్వీకరించబోమని ఆర్‌వో నాగలక్ష్మి తెలిపారు. నామినేషన్ల దాఖలుకు గడువు సమయం ఈ నెల 10వ తేదీ సోమవారం మధ్యాహ్నం 3గంటల వరకు ఉందన్నారు. నిర్ణీత సమయం లోపు కలెక్టరేట్ ప్రాంగణంలోకి ప్రవేశించిన వారి నామినేషన్లను స్వీకరిస్తామన్నారు.

నైపుణ్యాన్ని పెంపొందించుకుంటేనే మెరుగైన భవిష్యత్

● గుండె వైద్య నిపుణులు డాక్టర్ నాగశ్రీహరిత
● భాష్యం బ్లూమ్స్‌లో ఘనంగా సాంస్కృతిక ఉత్సవాలు


మాట్లాడుతున్న డాక్టర్ నాగశ్రీహరిత


నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో నైపుణ్యాన్ని పెంపొందించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ నాగశ్రీహరిత అన్నారు. శుక్రవారం భాష్యం బ్లూమ్స్ వీబీసీ క్యాంపస్‌లో హూప్లా పేరుతో ప్రారంభమైన కల్చరల్ డే వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. డాక్టర్ నాగశ్రీహరిత మాట్లాడుతూ కృత్రిమ మేధ వేగంగా విస్తరిస్తున్న నేటి సాంకేతిక యుగంలో పిల్లలు సెల్‌ఫోన్‌కు బానిసలుగా మారుతున్నారని, ఈ నేపథ్యంలో తల్లితండ్రులు పిల్లల్ని పర్యవేక్షించాలని సూచించారు. సామాజిక బాధ్యత, నైతిక విలువల్ని నేర్పించి భావి పౌరులుగా విద్యార్థుల్ని తీర్చిదిద్దాలని అన్నారు. భాష్యం బ్లూమ్స్ పూర్వ విద్యార్థి డాక్టర్ సాయిఈశ్వర్ చౌదరి ప్రసంగిస్తూ ఇక్కడ విద్యనభ్యసించి తిరిగి ఇదే పాఠశాలకు అతిథిగా రావడం తనకు ఎంతో మరపురాని జ్ఞాపకమన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న భాష్యం విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా భాష్యం విద్యాసంస్థలు కృషి చేస్తున్నాయన్నారు. భాష్యం విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ భాష్యం హనుమంతరావు మాట్లాడుతూ ఆధునిక విద్యా విధానాన్ని ప్రోత్సహిస్తూ నూతన బోధన పద్ధతుల ద్వారా విద్యార్థులకు అత్యుత్తమ విద్యనందించేందుకు నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. సభకు భాష్యం మెడెక్స్ కళాశాల ప్రిన్సిపాల్ హరిబాబు అధ్యక్షత వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం అతిథుల చేతులమీదుగా విద్యార్థులకు బహుమతుల ప్రదానం నిర్వహించారు. కార్యక్రమంలో భాష్యం బ్లూమ్స్ ప్రైమరీ క్యాంపస్ ప్రిన్సిపాల్ కవిత, సెకండరీ క్యాంపస్ ప్రిన్సిపాల్ గిరిజారాణి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని భాష్యం బ్లూమ్స్ జెడ్ ఈవో వరలక్ష్మి పర్యవేక్షించారు.

పశువులకు.. నైట్రేట్ ముప్పు

(5వ పేజీ తరువాయి)

(పార్ట్ పర్ మిలియన్) నుంచి 540 పీపీఎం ఉన్నట్లు తేలింది. తెనాలి ప్రాంతంలో నీటిలో ఎక్కువ శాతం నైట్రేట్ ఉన్నట్లు వెటర్నరీ బయోలాజికల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వెల్లడించిన నివేదికలో తేలింది. పశుసంవర్థక శాఖ లెక్కల ప్రకారం పశువులు తాగే నీటిలో నైట్రేట్ 100 పీపీఎం మాత్రమే ఉండాలి. అది దాటితే సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గటం, కిడ్నీ విఫలం కావటం, చివరకు మరణిస్తాయని పశుసంవర్థక శాఖ అధికారులు చెబుతున్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు సందర్భంగా అన్ని గ్రామాల్లో నీటి నమూనాలు సేకరించాలని అధికారులు ఆదేశించారు. ఇప్పటివరకు 21 నీటి నమూనాలు సేకరించి విజయవాడ ల్యాబ్‌కు పంపినట్లు వ్యాధుల నిర్ధారణ ప్రయోగశాల ఏడీఏ బి.మాధవి తెలిపారు.

యజమానులు అప్రమత్తం కావాలి

కొన్ని ప్రాంతాల్లో సేకరించిన నీటిలో నైట్రేట్ శాతం ఎక్కువగా ఉన్నట్లు రిపోర్టు వచ్చిన మాట వాస్తవమే. పశువులు తాగే నీటిలో నైట్రేట్ శాతం పెరిగితే అది అనేక రకాల దుష్పరిణామాలకు దారితీస్తుంది. పశువుల ఆరోగ్యం క్రమేపీ క్షీణిస్తుంది. కాబట్టి యజమానులు అప్రమత్తం కావాలి. పశువులు తాగడానికి సురక్షితమైన నీటిని మాత్రమే వినియోగించాలి. పశువుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు అశ్రద్ధ చేయకుండా పరీక్షలు జరిపిస్తూ ఉండాలి.



- ఓ నరసింహారావు, పశుసంవర్థక శాఖ అధికారి, గుంటూరు జిల్లా

11 నుంచి ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో హ్యాపీనెస్ ప్రోగ్రాం

తాడేపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ ఎయిర్ బ్రీత్ హ్యాపీనెస్ కార్యక్రమం ఫిబ్రవరి 11 నుంచి ఆరు రోజుల పాటు స్థానిక ఎఎస్ఆర్ నాచురల్ ఫామ్స్‌లో జరగనున్నట్లు నిర్వాహకులు మేకా శ్రీధర్‌రెడ్డి, ఇట్టా భాస్కర్‌లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు మొదటి బ్యాచ్, సాయంత్రం 6.30 గంటల నుంచి రెండో బ్యాచ్ జరుగుతుందని పేర్కొన్నారు. ఆందోళన, ఉద్రిక్తతలు, ఒత్తిడి, భయం, హ్యాపీనెస్, రిలాక్సేషన్, శాంతి, విశ్వాసం, మనసులో స్పష్టత, ఫోకస్ బెటర్ హెల్త్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9949396490 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలి

దుగ్గిరాల, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పందొమ్మిదేళ్లలోపు వారందరికీ నులిపురుగుల నివారణ మాత్రలను వేయడం లక్ష్యంగా పని చేయాలని ఎంపీడీఓ ఏ.శ్రీనివాసరావు అన్నారు. ఈ నెల 10న జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ఈమని, దుగ్గిరాల ప్రాథమికవైద్య ఆరోగ్యకేంద్రాల అధికారులు, మండల విద్యాధికారి, అంగన్వాడీ సూపర్‌వైజర్లతో సమావేశమయ్యారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలోని కళాశాలల్లోనూ, పాఠశాలల్లోనూ, చదివే విద్యార్థినీ విద్యార్థులతో పాటు, అంగన్వాడీ కేంద్రాల్లో చదివే చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు విధిగా అందించాలన్నారు. ఎంఈఓ కాజ లక్ష్మీనారాయణ, అంగన్వాడీ సూపర్ వైజర్ భవాని, పీహెచ్‌సీ వైద్యులు మహ్మద్‌ఇజాజ్, డాక్టర్ ఇందిర పాల్గొన్నారు.

వట్టిచెరుకూరులో...

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా కృషి చేయాలని ఎంపీడీవో రమేష్ బాబు పిలుపు నిచ్చారు. వట్టిచెరుకూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహించాలని ఆయన సూచించారు. సమావేశంలో వట్టిచెరుకూరు, ముట్లూరు, కాట్రపాడు వైద్యాధికారులతో పాటు మూడు పీహెచ్‌సీల పరిధిలోని ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతులలో భాగంగా శనివారం మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈఈ జీ.సురేష్‌బాబు తెలిపారు. స్థానిక బాప్టిస్టుపేట, కుప్పురావుకాలనీ, పాత మంగళగిరి, తెనాలి రోడ్డు, షరాబ్ బజార్, మిద్దె సెంటరు, ఇస్లాంపేట, నాంచారమ్మ చెరువు, గండాలయపేట, మైలార్ నగర్, పార్కురోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, టిప్పర్ల బజారు, మార్కండేయ కాలనీ తదితర ప్రాంతాలతో పాటు తాడేపల్లి మండలంలో ఉండవల్లి గుహాలయాలు, పెనుమాకలో ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే

తుళ్లూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లక తప్పదని తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు హెచ్చరించారు. రాయపూడి సీడ్ యాక్సెస్ రోడ్డుపై శుక్రవారం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. సాయంత్రం గంటసేపు తనిఖీలు చేసినా ఎవరూ పట్టుపడలేదు. సీఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దన్నారు. ఎస్ఐ బాబురావు, సిబ్బంది పాల్గొన్నారు.

చిలువూరులో రేషన్‌బియ్యం స్వాధీనం

దుగ్గిరాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండల గ్రామం చిలువూరులో రేషన్ బియ్యాన్ని దుగ్గిరాల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని ఒక పిండి మర వద్ద రేషన్ బియ్యం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఎస్.వెంకటరవి సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడి చేసి రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాట్రగడ్డ వెంకటేశ్వరరావు, తోట ప్రసాద్, పాలేటి మహేష్, మాడుగుల శ్రీను తదితరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఫిరంగిపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేమవరం గ్రామ పెట్రోల్ బంకు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. గుంటూరు - కర్నూలు హైవే రోడ్డులోని వంతెనపై నరసరావుపేట వైపు వెళ్తున్న కారు బ్రేక్ ఫెయిల్ కావడంతో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అలాగే మరో కారును కూడా ఢీకొనగా రెండు కార్లు నుజ్జునుజ్జయ్యాయి. రెండు కార్లలో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు.

12న పౌరాణిక పద్యగాన పోటీలు

మంగళగిరి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పాతమంగళగిరి పద్మశాలీయ బహూత్తమ సేవా సంఘం (కల్యాణ మండపం) ఆధ్వర్యంలో ఈ నెల 12న శ్రీ భద్రావతీ సమేత భావనారుషి స్వామివారి పవళింపు సేవ సందర్భంగా పౌరాణిక కళాకారులకు పద్యగాన పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని విశ్వశాంతి కళా పరిషత్ కన్వీనర్ పొట్లాబత్తుని లక్ష్మణరావు తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సాహితీ కళావేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు, బుద్ధ విహార అధ్యక్షుడు రేకా కృష్ణార్జునరావు, కారంపూడి అంకమ్మరావు, సందుపట్ల భూపతి, మునగాల బాలకృష్ణ పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తలను విడిగా సేకరించాలి



.సమావేశంలో మాట్లాడుతున్న ఈవోపీఆర్‌డీ సాయిలీల

తాడికొండ(లాం)ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్తలను విడివిడిగా సేకరించేలా పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించాలని ఈవోపీఆర్‌డీ కే సాయి లీలా సూచించారు. మండలంలోని లాంలోని సంపద సృష్టి కేంద్రాల వద్ద శుక్రవారం పంచాయతీ కార్యదర్శులకు తడి, పొడి చెత్తల సేకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలు స్వచ్ఛంగా ఉండేవిధంగా కార్యదర్శులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో ఐటీసీ ప్రాజెక్ట్ అసోసియేట్ బీ కోటేశ్వరరావు, డీఆర్‌పీ కే అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఏబీపాలెంలో...

ఏబీపాలెం (పెదనందిపాడు) ఫిబ్రవరి, 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలని ఈవోపీఆర్డీ వరూధిని అన్నారు. మండల పరిధిలోని ఏబీపాలెంలో సంపద సృష్టి కేంద్రం వద్ద శుక్రవారం పంచాయతీరాజ్ శాఖ సహకారంతో ఆన్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలు ఆదాయాలను సమకూర్చుకునేందుకు సంపద సృష్టి కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. కంపోస్టు ఎరువును తయారు చేసి దీని అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయాలను పంచాయతీ పనులకు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ, ఎన్‌జీవో సంస్థల అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్లు ఎం యశ్వంత్ శ్రీనివాస్, కే ఉమామహేశ్వరి, లక్ష్మీ హారిక, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ వరూధిని



తాడికొండలో రేషన్ షాపుల్లో తనిఖీ చేస్తున్న తహసీల్దార్ మెహర్

రేషన్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు

తాడికొండ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల్లో తాడికొండ తహసీల్దార్ మెహర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గ్రామంలోని నాలుగు షాపుల్లో తనిఖీలు నిర్వహించి, రికార్డులను పరిశీలించారు. గ్రౌండ్ లెవల్‌లో ఉన్న స్టాక్‌కు, ఈపాస్ మిషన్‌లో ఉన్న స్టాక్‌కు వ్యత్యాసాలు చూశారు. ఎండీయూ వాహనాలను కూడా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రేషన్ పంపిణీలో డీలర్లు,ఎండీయూ వాహనదారులు అక్రమాలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ వెంట సివిల్ సప్లై డీటీ దేవ్‌రాజు, ఆర్ఐ నూతలపాటి హనుమంతరావు, వీఆర్‌వో మాల్యాద్రి ఉన్నారు.

పెదనందిపాడులో...

పెదనందిపాడు, ఫిబ్రవరి, 7 (ఆంధ్రజ్యోతి) : రేషన్ డీలర్లు అవకతవకలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శంకర్‌బాబు హెచ్చరించారు. మండల పరిధిలోని నాగులపాడు, వరగాని, పెదందిపాడు గ్రామాల్లోని 12, 16, 14వ నంబరు రేషన్ దుకాణాలను శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లోని బియ్యం నిల్వలు, ఈపోస్ మిషన్లో నిల్వలను వ్యత్యాసాలను పరిశీలించారు. ప్రతి నెలా 5లోపు మధ్యాహ్న భోజన నిర్వాహకులకు, అంగన్వాడీ కేంద్ర సిబ్బందికి సరుకులు పంపిణీ చేయాలన్నారు. తహసీల్దార్ వెంట పౌరసరఫరాల డీటీ శివశంకర్, ఆర్ఐ సాహితీమోహన్ పాల్గొన్నారు.



బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న తహసీల్దార్ శంకర్‌బాబు, పౌరసరఫరాల డీటీ శివశంకర్

సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కేఎల్ యూనివర్సిటీ ఆర్టిఫిషియల్ ఇంటె లిజెన్స్ అండ్ డేటా సైన్స్, వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళగిరి మండలంలోని నూతక్కిలో శుక్రవారం రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సేంద్రియ వ్యవసాయం ఎలా చేయాలో వివరించారు. కేఎల్‌యూ వ్యవసాయ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రత్నప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతిలో లభించే జీవ ఎరువులు, సేంద్రియ పద్ధతుల ద్వారా వ్యవసాయం చేయడం వలన ఖర్చు తగ్గడంతోపాటు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను దిగుబడి చేసుకోవచ్చని చెప్పారు. ఏఐ, డీఎస్ విభాగాధిపతి డాక్టర్ బీ.తిరుపతిరెడ్డి మాట్లాడుతూ అధిక దిగుబడి, తెగుళ్ల నిరోధకత విత్తనాలు, జీపీఎస్, డ్రోన్స్, సెన్సార్ల సహాయంతో గ్రీన్, పాలీ హౌస్, స్ప్రింకర్ల ద్వారా ఆధునిక వ్యవసాయ పద్ధతులను వినియోగించడం వలన డబ్బు, సమయం ఆదా అవు తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వి.జోనితిన్, డాక్టర్ సమీర్, డాక్టర్ కిరణ్, కోఆర్డినేటర్ పీ.సురేష్ పాల్గొన్నారు.



నూతక్కిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

కల్యాణ మండపం నిర్మాణానికి విరాళం

పెదనందిపాడు (ఏబీపాలెం) ఫిబ్రవరి, 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అబ్బినేనిగుంటపాలెంలోని చిమటా సంజీవ్ కల్యాణ మండపం నిర్మాణానికి దాత చంద్రయ్య శుక్రవారం విరాళంగా అందజేశారు. గ్రామానికి చెందిన ఇడపలపాటి సరస్వతి జ్ఞాపకార్థం భర్త విశ్రాంత ఉపాధ్యాయులు చంద్రయ్య రూ.10 లక్షల నగదు చెక్కును కమిటీ కోశాధికారి పెద్ది సాంబశివరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతను కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు.

బాలికను వేధించిన కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు

మంగళగిరి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బాలికను బెదిరించి ఫొటోలు మార్ఫింగ్ చేసిన కేసులో నిందితుడిని మంగళగిరి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూరల్ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం సీఐ వై.శ్రీనివాసరావు, ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ ఈ కేసు వివరాలను వెల్లడించారు. ఎర్రబాలెంకి చెందిన బాలిక స్థానిక ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. బాలిక కుటుంబం హైదరాబాద్ వెళుతూ పారిశుధ్య సిబ్బందికి సమాచారం నిమిత్తం వారి ఇంటి ముందు గోడపై ఫోన్ నంబరు రాశారు. ఎర్రబాలెం పారిశ్రామిక వాడలో నివాసం వుంటున్న షేక్ బాషు ఆ ఫోన్ నంబరుకు తరచు ఫోన్ చేస్తూ బాలికతో పాటు ఆమె తల్లిని సైతం బెదిరించాడు. బాలిక వెంటపడుతూ వేధింపులకు గురిచేశాడు. చివరకు ఆ బాలిక ఫొటోను సేకరించి, అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి ఆమె సెల్‌ఫోనుకు పంపించాడు. ఈ మార్ఫింగ్ ఫొటోను సోషల్ మీడియాలో పెడతానంటూ బెదిరింపులకు దిగాడు. ఈ విషయం తెలిసిన బాలిక తండ్రి గుండెపోటుకు గురికాగా, బాలిక ఆత్మహత్యాయత్నం చేసింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు బాషును అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు.

'సాల్ట్' లక్ష్యాన్ని విస్మరించ వద్దు : వీరయ్య

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పాఠశాల విద్య బలోపేతం కోసం ప్రపంచ బ్యాంకు ఆర్థిక సాయంతో ప్రభుత్వం చేపట్టిన సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్ ఫార్మేషన్ (సాల్ట్) ప్రాజెక్టు లక్ష్యాన్ని విస్మరించవద్దని దానికి సంబంధించిన జిల్లా కో-ఆర్డినేటర్ తోట వీరయ్య అన్నారు. మండల విద్యా శాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సాల్ట్ ప్రోగ్రాం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణాత్మకంగా అమలు చేసినప్పుడే లక్ష్యాన్ని చేరుకోలుగుతామని అన్నారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు నిరంతర ఉపాధ్యాయ వృత్తి పరమైన అభివృద్ధి కార్యక్రమం. ప్రభుత్వ పాఠశాలలో విద్యను బలోపేతం చేయడం ముఖ్యం. సాల్ట్ కార్యక్రమం అసలు పేరు సపోర్టింగ్ ఆంధ్రా లెర్నింగ్ ట్రాన్స్‌ఫ్మేషన్. లక్ష్యాలు ఇలా ఉన్నాయి. ఉపాధ్యాయ వృత్తిని, తరగతి గది అంచనాలను, బాల్య విద్యను, ఉపాధ్యాయ, విద్యార్థుల మధ్య సంబంధాలు, బోధనా పద్ధతులు మెరుగుపరచుకోవడం వంటివి సాల్ట్ ముఖ్యఉద్దేశాలు అని చెప్పారు. కార్యక్రమంలో మండల విద్యా శాఖ అధికారులు సత్యనారాయణమూర్తి, నిర్మల పాల్గొన్నారు.



సాల్ట్ ప్రోగ్రాం లక్ష్యాన్ని వివరిస్తున్న జిల్లా కో-ఆర్డినేటర్ వీరయ్య

జగన్ వ్యాఖ్యలు అర్థరహితం : టీడీపీ

కాకుమాను, ఫిబ్రవరి 7: ప్రజాస్వామ్యం గురించి మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందని టీడీపీ సీనియర్ నాయకుడు కొల్లా వీరయ్య చౌదరి, మాజీ ఎంపీపీ రాంగోపాల్ విమర్శించారు. స్థానిక మండల పార్టీ కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. వైసీపీ హయాంలో ప్రజా సమస్యలపై మొద్దు నిద్రవహించిన జగన్, టీడీపీ ప్రభుత్వం, సీఎం చంద్రబాబు నాయుడు పై అవాకులు చెవాకులు పేలడం గర్హనీయమన్నారు. ప్రజా సమస్యల పై చర్చించే వేదిక అయిన అసెంబ్లీని వైసీపీ అధినేత, ఆ పార్టీ ఎమ్మెల్యేలు బహిష్కరించడం వారిని ప్రజాస్వామ్యంపై, ప్రజలపై ఉన్న ఆలోచనలకు అద్దం పడుతుందన్నారు. ఈ సమావేశంలో నల్లమోతు పూర్ణచంద్రరావు, బోడపాటి ప్రసాద్, పోలవరపు సాంబశివరావు పాల్గొన్నారు.

పశువులకు రేడియం స్టిక్కర్లు

తుళ్లూరు,(రాయపూడి) ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాయపూడిలో పశువులకు రేడియం స్టిక్కర్లు, ట్యాగ్‌లు వేసే కార్యక్రమం శుక్రవారం రెండవ రోజు కొనసాగింది. హైకోర్టు న్యాయవాదుల కమిటీ సూచన మేరకు మూగజీవాల వలన వాహన చోదకులకు ప్రమాదాలు జరగకుండా, అదేవిధంగా వాటికి కూడా హాని కలగకుండా రేడియం స్టిక్కర్లు, ట్యాగ్‌లు రాయపూడి పంచాయతీ సిబ్బంది నిర్వహించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆధ్వర్యంలో 50 గేదేలకు రేడియం ట్యాగ్‌లు వేసినట్లు రాయపూడి పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునరావు తెలిపారు.

పాఠశాల గేటు ఏర్పాటుకు రూ.10 వేల వితరణ

దుగ్గిరాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈమనిలో నార్త్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గేటు ఏర్పాటు కోసం దాత చుండూరు భాస్కరరావు రూ.10 వేలను హెచ్‌ఎం కరీముల్లాకు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భాస్కరరావును ఎంఈఓ కాజ లక్ష్మీనారాయణ, హెచ్‌ఎం బాలసుందరం, వీవీ సతీష్, ఇతర ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు తదితరులు ఘనంగా సత్కరించారు.



దుగ్గిరాలలోని శ్రీసత్య సాయి సేవా సమితి, టాటా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు భాషపై జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో తృతీయ స్థానం పొందిన విజేతలకు ఎం.స్మైలీకి సేవాసమితి నిర్వాహకులు బహుమతితోపాటు, ప్రతిభా ధృవీకరణ పత్రాన్ని అందించారు. పోటీలో పాల్గొన్న విద్యార్థినులందరికీ ప్రోత్సాహక బహుమతులు అందించారు. విద్యార్థినులను హెచ్‌ఎం శోభారాణితో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. - దుగ్గిరాల.



పెదవడ్లపూడిలో శుక్రవారం రాత్రి శ్రీ భగవాన్ సత్య షిర్డీ సాయిబాబా వారి మందిరాన్ని దర్శించిన తిరుపతి ఎర్రచందనం యాంటీ స్మగ్లింగ్ టాస్క్ ఫోర్స్ ఎస్పీ ఎల్.సుబ్బారాయుడికి బాబా వారి మెమెంటో, ప్రసాదాలను అందజేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం - మంగళగిరి.



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న డివిజన్ పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ సత్యనారాయణ

రైతులు పాడి పరిశ్రమ వైపు మొగ్గుచూపాలి

అన్నపర్రు(పెదనందిపాడు), ఫిబ్రవరి, 7 (ఆంధ్రజ్యోతి) : రైతులు వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమ వైపూ మొగ్గుచూపాలని డివిజన్ పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకుడు డాక్టర్ కేవీవీ సత్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని అన్నపర్రు రైతు సేవా కేంద్రం వద్ద రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మేలుజాతి దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పశుపోషకులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఇచ్చే అనేక రకాల రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ఉచితంగా పశు వైద్యశిబిరాలు నిర్వహించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నట్లు తెలిపారు. లేగదూడల పోషణ యాజమాన్య పద్ధతులు పాల నాణ్యతలను పెంపొందించుకోవడం, ఏడాదికి ఒక దూడ, టీకాల యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం మేలుజాతి దూడలను పెంచుతున్న రైతులకు బహుతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీ నాయుడు శైలజ, వైద్యులు బీ స్వాతి విమల, అనిత, నంద కిషోర్, హరీష్ కన్నా, సహాయకులు సుజాతలక్ష్మీ, కావ్య, వలి పాల్గొన్నారు.

కేఎల్‌యూ విద్యార్థి బృందానికి ప్రథమ బహుమతి

తాడేపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో చివరి ఏడాది చదువుతున్న విద్యార్థుల బృందానికి హ్యుందాయ్ టెక్నోవేషన్ 2024 - ఆలిండియా టెక్నికల్ వర్చువల్ సింపోజియంలో ప్రథమ బహుమతి లభించింది. ఈ విషయాన్ని వర్సిటీ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ రాజశేఖరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ దేశవ్యాప్తంగా అగ్రశ్రేణికి చెందిన వివిధ ఇంజనీరింగ్ విద్యాసంస్థలకు పోటీగా ఈ బృందం తమ వినూత్న ప్రాజెక్టును ఈవీలలో రాబోయే తరానికి చెందిన మానిటరింగ్ కోసం స్మార్ట్ ఇంటర్‌ఫేస్‌తో పరిశ్రమ నిపుణులను ఆకట్టుకుందన్నారు. హ్యుందాయ్ నిర్వ హించిన ఈ పోటీల్లో నిజ, సమయ సాధ్యత, వ్యయ ప్రయోజన విశ్లేషణ, సాంకేతిక మద్దతు ప్రదర్శన ఆధారంగా జట్లను అంచనా వేశారన్నారు. కేఎల్‌యూ మెంటార్ డాక్టర్ కల్యాణ్ దూసర్లపూడి మార్గదర్శకత్వంలో కేమురళి, మనోజ్, గౌతమ్‌ల బృందం ఇ-బైక్ మెయిన్ యూజర్ ఇంటర్‌ఫేస్ డిస్‌ప్లేను అభివృద్ధి చేసిందన్నారు. ట్రిపుల్‌ఈ విభాగాధిపతి డాక్టర్ పాండ్యన్ మాట్లాడుతూ తమ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు టెక్నాలజీ ద్వారా వాహనం గుంతలను ముందుగానే గుర్తించడంతోపాటు నిజ సమయంలో రోడ్డు ప్రమాదాల గురించి వాహన చోదకులను హెచ్చరిస్తుందన్నారు. అత్యవసర సమయంలో సింగల్ హ్యాండ్ అసిస్టెన్స్, ఎస్‌వోఎస్ అలెర్ట్‌తోపాటు సురక్షితం కాని రైడింగ్‌ను గుర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఏ శ్రీనాథ్, ప్రోవీసీ డాక్టర్ ప్రసాద్, డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, డాక్టర్ పాండ్యన్, డాక్టర్ కల్యాణ్ దూసర్లపూడి తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.



విద్యార్థినిని అభినందిస్తున్న కేఎల్‌యూ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ రాజశేఖరరావు, పాండ్యన్ తదితరులు

విజయకీలాద్రిలో శ్రీనివాసునికి చక్రస్నానం

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంలో శుక్రవారం 8వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. వేద విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ ఉత్సవాలు నిర్వహించారు. తొలుత వెంకటేశ్వరస్వామికి అవభృద స్నానము, కృష్ణానదిలో చక్రతీర్థం వైభవంగా నిర్వహించారు. అనంతరం ప్రోక్షణ శ్రీ పుష్పయాగం, ద్వాదశారాధన, మహాపూర్ణాహుతి, వేదాశీర్వాచనంతో అంగరంగ వైభవంగా ఉత్సవ కార్యక్రమం జరిగింది. చినజీయర్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు, అనంతస్వామి, వేదవిద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.



స్వామివార్లకు కృష్ణానదిలో చక్రస్నానం నిర్వహిస్తున్న చినజీయర్ స్వామి

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తాం

● ప్రత్తిపాడు తాలూకా యూనిట్ ఎన్‌జీవో అసోసియేషన్ అధ్యక్షుడు అనీల్ కుమార్

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తామని, ఉద్యోగుల పరంగా ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి సాధ్యమైనంత వరకు పరిష్కరించుకుందామని ప్రత్తిపాడు తాలూకా యూనిట్ ఎన్‌జీవో అసోసియేషన్ అధ్యక్షుడు అనీల్ కుమార్ భరోసా ఇచ్చారు.

వట్టిచెరుకూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎన్‌జీవో అసోసియేషన్ అధ్యక్షుడు అనీల్ కుమార్‌తో పాటు అసోసియేషన్ కోశాధికారి శేషగిరిరాజు, ఉపాధ్యక్షురాలు సుధారాణిలు 2025 ఎన్‌జీవో క్యాలెండర్‌ను ఎంపీడీవో రమేష్ బాబు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో డీటీ దరియావలి ఆవిష్కరించారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ అయిన చక్రవరం శేషంరాజు, చక్రవరం కృష్ణంరాజుల ద్వారా యావన్మందికి తెలియజేయునది. దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని వారసతత్వా నా క్లయింట్లుకు చెందినది. వారు ప్రస్తుతం అక్కడలేనందున వేరేవారు దానిని అక్రమించుకొనుటకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దానిలో ప్రస్తుతం రేకుల ఇల్లు కలదని దానిని తొలగించి అక్రమ నిర్మాణాలు చేపట్టుచున్నట్లు తెలిసినది. అందునిమిత్తం ఈ పత్రికాప్రకటన ద్వారా తెలియజేయడమైనది. అలా అతిక్రమించినవారు మేము తీసుకొనే లీగల్ చర్యలకు బాధ్యులగుదురు.

షెడ్యూలు

గుంటూరు జిల్లా, కొరిటిపాడు సబ్ రిజిస్ట్రార్, గోరంట్ల పంచాయతీ, డి.నెం.135, 151లలో డోర్.నెం.11-765 అసెస్‌మెంట్ నెం.13643కు హద్దులు : తూ:- అ.30 లు వెడల్పు గల రోడ్డు ఈనిశ అ.20లు, ద: గలిచర్ల రామకృష్ణ శర్మ నం.220 అ.56లు, ప: చిగ్రాపూరి శివబ్రహ్మాచారి గారు షేక్ మదార్ గారికి విక్రయించిన నెం.168/బీ రు ప్లాటు స్థలం అ.20లు, ఉ: విశ్వనాధుని బ్రహ్మం గారి నెం.221/ఎ రు ప్లాటు హద్దు అ.56లు.

ఈ హద్దుల మధ్య చ.గ.125 స్థలం, అందలి రేకుల ఇల్లు.

యం.కృష్ణారావు, అడ్వకేట్ & నోటరి, ఒంగోలు, సెల్ : 9848688079

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

నేడు, రేపు 33వ జాతీయ నాస్తిక మేళా

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మంగళగిరి వద్ద చార్వాక ఆశ్రమంలో 33వ జాతీయ నాస్తిక మేళా జరుగుతుందని నాస్తిక సమాజం డివిజన్ నాయకులు శివకృష్ణ తెలిపారు. ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించే మేళాను జయప్రదం చేయాలని కోరారు. దేవుని చుట్టూ సాగుతున్న వ్యాపారాన్ని బహిర్గత పరిచి మూఢ విశ్వాసాల నుంచి ప్రజలను విముక్తి చేయాలనే తలంపుతో మేళా జరుగుతుందన్నారు. మేళా కరపత్రాలను శుక్రవారం తెనాలిలో ఆవిష్కరించారు. కె.బెన్‌హర్ బాబు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ సంజన సింహ

ఎమ్మెల్సీ ఎన్నికలకు 51 పోలింగ్ కేంద్రాలు

● సబ్ కలెక్టర్ సంజన సింహ

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తెనాలి డివిజన్‌లోని ఎమ్మెల్సీ ఎన్నికలకు 51 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని సబ్ కలెక్టర్ సంజన సింహ శుక్రవారం తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, తెనాలి నియోజకవర్గంలో 27 పోలింగ్ కేంద్రాలు ఉండగా మిగిలిన సబ్ డివిజన్‌లో మరో 24 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్య వెయ్యి దాటితే మరో పోలింగ్ కేంద్రం పెట్టే అవకాశం ఉందని, ఇందుకు గాను అదనంగా 8 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదన చేశామన్నారు. తెనాలిలో 2, మంగళగిరి 2, పొన్నూరు 1, తాడేపల్లి మండలంలో 3 కేంద్రాలు ఈ ప్రతిపాదనలో ఉన్నట్లు చెప్పారు. ఎన్నికల కమిషన్ ఈ కేంద్రాలకు అనుమతులు ఇస్తే మొత్తం 59 పోలింగ్ కేంద్రాలు అవుతాయని పేర్కొన్నారు. కృష్ణా గుంటూరు శాసన మండలి గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఎన్నికలకు ఇప్పటికే డివిజన్, మండల స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి విధి విధానాలను తెలిపామన్నారు. ఈ నెల 27న ఈ పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఎన్నిక జరుగుతుందని, మార్చి 8 వరకు ఎన్నికల ప్రక్రియ ఉంటుందని ఆమె వివరించారు.

దావులూరు, అత్తోట ఫీడర్ పరిధిలో విద్యుత్ నిలిపివేత

● విద్యుత్ ఏఈ ప్రదీప్‌కుమార్

కొల్లిపర, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దావులూరు, అత్తోట ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు నిమిత్తం విద్యుత్‌ను నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక సబ్‌స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అత్తోట ఫీడర్ పరిధిలో దంతలూరు, కుంచవరం, అత్తోట గ్రామాల్లో, అదేవిధంగా దావులూరు ఫీడర్ పరిధిలో చెముడుబాడు, దావులూరు పరిసర గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌ను నిలిపి వేస్తున్నట్లు ఏఈ తెలియజేశారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

బాలికల్లో వచ్చే ఆరోగ్య సమస్యలపై అవగాహన

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): బాలికలు, యువతులులో వచ్చే ఆరోగ్య సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ షేక్ అస్మా అన్నారు. పట్టణంలోని సెయింట్ ఆన్స్ స్కూల్లో శుక్రవారం బాలికల్లో వచ్చే ఆరోగ్య సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశుభ్రత, పౌష్టికాహారం, శారీరక, మానసిక ఆరోగ్య సమస్యల గురించి అవగాహన కల్పించారు. సర్వైకల్ క్యాన్సర్ నివారణ కోసం హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సదస్సులో డాక్టర్ రేణు కుమార్, పాఠశాల నిర్వాహకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యబృందం

కొనసాగుతున్న సదరం రీ వెరిఫికేషన్

తెనాలి రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో గత రెండు రోజులుగా ఆలస్యంగా నిర్వహిస్తున్న కంటి విభాగ సదరం రీ వెరిఫికేషన్ ప్రక్రియ శుక్రవారం సమయపాలన పాటిస్తూ వైద్యులు ప్రారంభించారు. శుక్రవారం ఉదయం ఆంధ్రజ్యోతిలో శిబిరం ఆలస్యంగా ప్రారంభించిన విషయంపై కథనం ప్రచురితమవటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గత ప్రభుత్వంలో వైకల్య శాతం లేనివారుకూడా సదరం ధ్రువీకరణ పత్రాలు పొంది దివ్యాంగుల పింఛన్ పొందారన్న ఆరోపణల నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఇటీవల రీ వెరిఫికేషన్ ప్రక్రియను ప్రారంభించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా బుధ, గురు, శుక్రవారాల్లో ప్రత్యేక క్యాంపుల ద్వారా వైకల్య ధ్రువీకరణ రీ వెరిఫికేషన్ నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో జరుగుతోంది. దాదాపుగా 80 మంది ఈ రీ వెరిఫికేషన్‌కు హాజరై పరీక్షలు చేయించుకున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపారు.

పీఎంశ్రీ పథకంతో ఉన్నత పాఠశాలల్లో అభివృద్ధి పనులు

● జిల్లాలో ఫేజ్-1 అమలు

● కెమిస్ట్రీ ల్యాబ్, ఆటస్థలం అభివృద్ధి, ర్యాంపుల ఏర్పాటు



ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేస్తున్న ర్యాంపులు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి స్కూల్స్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల దిశ దశ మారుతోంది. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం కింద మొదటి విడత గుంటూరు జిల్లాలోని పలు పాఠశాలలను ఎంపిక చేసింది. 400 మంది విద్యార్థులకు పైగా ఉన్న పాఠశాలలను గుర్తించి కెమిస్ట్రీ ల్యాబ్ నిర్మాణానికి రూ.15.58 లక్షలు, ఆట స్థలం అభివృద్ధికి రూ.5లక్షలు, ర్యాంపుల ఏర్పాటుకు రూ.1.25 లక్షలు మంజూరు చేశారు. తాజాగా జిల్లాలోని 21 పాఠశాలలకు ర్యాంపుల ఏర్పాటుకు గాను నిధులు ఇచ్చారు. తొలి విడతగా రూ.50 వేలు పీఎఫ్ఎంఎస్ విధానంలో బ్యాంకు ఖాతాలను నిధులు జమచేశారు. పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లేందుకు వీలుగా ఈ ర్యాంపులను రైలింగ్‌తో ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోని నారాకోడూరు, రేవేంద్రపాడు, నల్లపాడు, కాకుమాను, కొల్లిపర, ఓబులునాయుడు పాలెం, నూతక్కి, ఎర్రబాలెం, సిరిపురం, నంబూరు, పెదనందిపాడు, వేములూరిపాడు, మామిళ్లపల్లి, నిడుబ్రోలు, ప్రత్తిపాడు, తాడేపల్లి, రావెల, తెనాలి కొత్తపేట, అంగలకుదురు, తుళ్లూరు, ముట్లూరు ఉన్నత పాఠశాలలకు ఈ నిధులు మంజూరు చేశారు. ఇదే పథకం కింద ఇప్పటికే ల్యాబ్‌ల నిర్మాణాన్ని చేపట్టి సగానికి పైగా పనులను పూర్తి చేశారు. ఆట స్థలాలకు కూడా కేటాయించిన నిధుల్లో సగం వరకు ఇవ్వడంతో మెరక వేయడంతో పాటు మూడు క్రీడలకు పటిష్టమైన కోర్టులను సిద్ధం చేసుకుంటున్నారు. ఈ పథకం కింద దశలవారీగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఆయా పాఠశాలల్లో 2026-27 విద్యా సంవత్సరం వరకు నిర్వహించనున్నారు. ఈ పనులన్ని సమగ్ర శిక్షా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. రెండో విడత మరికొన్ని పాఠశాలలను గుర్తించి వసతులు కల్పించేందుకు సమగ్ర శిక్షా అధికారులు సిద్ధం చేశారు. ల్యాబ్‌లు లేని పాఠశాలలకు బయోలజీ ల్యాబ్, కంప్యూటర్, లైబ్రరీ రూమ్, సైన్స్ ల్యాబ్‌లు కూడా మంజూరు చేయనున్నారు. మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన కూరగాయల పెంపకానికి కిచెన్ గార్డెన్‌లను ఏర్పాటు చేసేందుకు, వర్షపు నీరు భూమిలోకి ఇంకేందుకు రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ విద్యార్థులకు తాగునీరు అందించేందుకు ఆర్వో వాటర్ ప్లాంట్‌లు, ఆరోగ్య పరిరక్షణకు హెల్త్ మేనేజ్‌మెంట్ సౌకర్యాలు, పాఠశాల విద్యుత్ అవసరాలకు సోలార్ ప్యానల్స్, ల్యాబ్‌లకు ఫర్నీచర్, ప్రయోగ సామాగ్రి తదితర అవసరాలను ఈ పథకం కింద కల్పించడంతో ఉన్నత పాఠశాలలు పూర్తిస్థాయి హంగులతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రూపుదిద్దుకుంటున్నాయి.

రౌడీయిజంపై ఉక్కుపాదం మోపుతాం

● నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు

● పాతనేరస్థులు సత్ప్రవర్తనతో మెలగాలి

● అడిషనల్ ఎస్పీ రమణమూర్తి



కార్డెన్ సెర్చ్ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతున్న ఏఎస్పీ రమణమూర్తి, డీఎస్పీ జనార్ధనరావు, సీఐ రమేష్‌బాబు తదితరులు

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణలో భాగంగా రౌడీయిజంపై ఉక్కుపాదం మోపుతున్నామని అడిషనల్ ఎస్పీ జీవీ రమణమూర్తి అన్నారు. శుక్రవారం పట్టణంలోని సుల్తానాబాదులోని వడ్డెర కాలనీ, సుగాలీ కాలనీలలో అడిషనల్ ఎస్పీ జీవీ రమణమూర్తి డీఎస్పీ జనార్ధనరావు 150మంది సిబ్బందితో కలసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం పట్టణ త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తున్నామన్నారు. అందులో భాగంగా ఇప్పటికే పలు ప్రాంతాలలో కార్డన్ సెర్చ్ ద్వారా ఆకస్మిక తనిఖీలు చేస్తూ అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుంటున్నామన్నారు. అంతే కాక సరైన పత్రాలు లేని వాహనాలను సైతం సీజ్‌చేసి స్టేషన్‌కి తరలిస్తున్నామని తెలిపారు. ప్రజలు కూడా నేర నియంత్రణకు సహకరిస్తూ అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా తారసపడితే స్థానిక పోలీసులకు గాని డయల్ 100కు గాని సమాచారం ఇవ్వాలని కోరారు. గతంలో గంజాయి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాలలో విచ్చలవిడిగా లభించేదని దానిపై ప్రత్యేక దృష్టిపెట్టి 90శాతం అదుపులోకి తెచ్చినట్లు వెల్లడించారు. తెనాలిలో కార్డన్ సెర్చ్ ద్వారా గతంలో యడ్ల లింగయ్య కాలనీలో సెర్చ్ నిర్వహించామని ప్రస్తుతం సుల్తానాబాదులో కార్డన్ సెర్చ్ ద్వారా ఎటువంటి గుర్తింపు పత్రాలు లేని 56 ద్విచక్రవాహనాలు, 3 ఆటోలను స్వాధీనపరుచుకొని ఒక అనుమానాస్పద వ్యక్తిని ఆరుగురు రౌడీషీటర్లను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. ఈ ప్రక్రియ నిరంతరం జరుగుతుందని అడిషనల్ ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ జనార్ధనారావు సీఐలు ఎస్ రమేష్ బాబు, మల్లికార్జునరావు, ఎస్ఐ రాజ్యలక్ష్మి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి వివేకవర్ధన్

వెట్టి చాకిరి చేయించడం నేరం

● సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వివేకవర్ధన్

తెనాలి క్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అమాయకులు, ఏ ఆధారం లేని వారిని గుర్తించి వారితో కొందరు వెట్టిచాకిరి చేయిస్తున్నారని, ఇది నేరమని సివిల్ జడ్జి వివేకవర్ధన్ (జూనియర్ డివిజన్) అన్నారు. శుక్రవారం వెట్టి చాకిరి నిర్మూలన దినోత్సవం సందర్భంగా స్థానిక కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ హాలులో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదర్భంగా జడ్జి వివేకవర్ధన్ మాట్లాడుతూ ఎలాంటి ఆసరా లేనివారు, అమాయకులు, నిరుపేదలను భయపెట్టి, ఆశ చూపి వారితో కొందరు వారి వ్యాపార సంస్థలలో, ఇళ్లలో, ప్రమాదకరమైన స్థలాల్లో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని, ఈ చర్య ఎంతో నేరమన్నారు. దీనికి మూడు సంవత్సరాల జైలు, రూ.2వేలు జరిమానా శిక్ష ఉంటుందన్నారు. ఇలాంటి కేసులపై సమాచారం ఉంటే స్థానిక లేబర్ డిపార్ట్‌మెంట్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ డి.వెంకటశివప్రసాద్, మండల విద్యాశాఖాధికారి విజయశాంతిబాబు, తెనాలి బార్ అసోసియేషన్ కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, అధ్యక్ష, కార్యదర్శులు కిషోర్, ఉదయశంకర్, లీగల్ సర్వీసెస్ కమిటీ పర్యవేక్షకులు షేక్ మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ రమాదేవి

అంటువ్యాధులపై అవగాహన

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఐతానగర్‌లోని మునిసిపల్ హైస్కూల్లో అంటువ్యాధుల నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వైద్యులు అవగాహన కల్పించారు. శుక్రవారం టీబీ యూనిట్ డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ క్షయ వ్యాధి అంటువ్యాధి అని, త్వరగా వ్యాప్తిచెందే అవకాశం ఉంటుందని వివరించి వ్యాధి లక్షణాలను వివరించారు. 18ఏళ్లలోపు పిల్లలు ఎక్కువగా ఈ వ్యాధి లక్షణాలతో పరీక్షలకు వస్తున్నారని, ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రవికుమార్, బెల్లంకొండ వెంకట్, రాజ్యలక్ష్మి, అనిత పాల్గొన్నారు.



ఫ్రైడే డ్రైడేపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారులు

ఫ్రైడే డ్రైడేపై అవగాహన

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామలింగేశ్వర పేటలోని శ్రీచైతన్య కళాశాలలో మలేరియా సబ్ యూనిట్ అధికారి అందే బాలచంద్రమౌళి ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే వివిధ రకాల వ్యాధులైన మలేరియా, డెంగ్యీ చికెన్‌గున్యా, బోదకాలు మొదడువాపు జికా వైరస్ వంటి వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇంటి పరిసరాల పరిశుభ్రతలను పాటించాలని నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అవుతు పద్మవాణి, పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, శానిటరీ సెక్రటరీలు కె.సంధ్య, డి.సాగర్, జి.చంద్రశేఖర్, హెల్త్ అసిస్టెంట్ షేక్ రషీద్, నవీన్, శ్రీనివాసరావు, ఏఎన్ఎం వాత్సల్య, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రల పంపిణీపై ప్రత్యేక సమావేశం



అల్బెండజోల్ మాత్రలను వైద్యులకు, ఏఎన్ఎంలకు అందిస్తున్న ఎంపీడీవో దీప్తి

తెనాలి రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో పీహెచ్‌సీల వైద్యులు హనీఫ్, వెంకటసుబ్బారావు, ఏఎన్ఎం, ఇతర వైద్యసిబ్బందితో కలిసి ఎంపీడీవో అత్తోట దీప్తి నులిపురుగుల నివారణకు అందించే అల్బెండజోల్ మాత్రల పంపిణీపై శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అత్తోట దీప్తి మాట్లాడుతూ చిన్నారుల ఎదుగుదలను దెబ్బతీసే నులిపురుగులను నివారించేలా ఫిబ్రవరి 10న జరుపుకునే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. చిన్నారుల్లో రక్తహీనత, కడుపునొప్పి, అలసట, ఎదుగుదలలోపం వంటి అనారోగ్య సమస్యలకు నులి పురుగులు కారణం కావచ్చన్నారు. వాటిని సకాలంలో నివారించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేలా ప్రభుత్వం జాతీయ నులిపురుగుల దినోత్సవం ద్వారా అల్బెండజోల్ మందులు పంపిణీ చేస్తుందన్నారు. మండలంలోని పీహెచ్‌సీల పరిధిలోని వైద్యులు, ఏఎన్ఎం, సిబ్బంది తప్పనిసరిగా 100శాతం విజయవంతం అయ్యేలా చూడాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో ఏ. శ్రీనివాసరావు, సాయి, పలువురు వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళపై కేసు నమోదు

కొల్లూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళను దుర్భాషలాడి ఇష్టం వచ్చినట్లు కొట్టి గాయపరిచిన మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.ఏడుకొండలు శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని జువ్వపాలెంకు చెందిన కొండసీమ వెంకటేశ్వరమ్మపై ఈ నెల 3వ తేదీ ఇంటికి ఎదురుగా నివాసం ఉంటున్న భూపతి సుశీల అనే మహిళను మురుగునీరుపోయే దారి విషయంపై ఘర్షణకు దిగి దుర్భాషలాడటంతో పాటు కొట్టి గాయపరిచింది. బాధితురాలు చికిత్స పొందుతూ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడితే చర్యలు

● తహసీల్దార్ వెంకటేశ్వర్లు హెచ్చరిక

కొల్లూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో ఎక్కడబడితే అక్కడ ఇసుక అక్రమ తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండల పరిధిలోని పెసర్లంక అరవింద వారధి, చిలుమూరు వద్ద కృష్ణానదిలో ట్రాక్టర్ల ద్వారా జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలను శుక్రవారం తహసీల్దార్ పరిశీలించారు. అరవింద వారధి వద్ద నదిలోకి ట్రాక్టర్లు వెళ్లే మార్గానికి గండి కొట్టించారు. చిలుమూరు వద్ద కూడా తవ్వకాలను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, స్థానిక అవసరాలకు ఇసుక కావాల్సిన మండల ప్రజలు సంబంధిత సచివాలయాల్లో వాహన నెంబరుతో నమోదు చేసుకుని సంబంధిత పత్రంతో ఇసుక తీసుకువెళవచ్చన్నారు. ఇతర మండలాల వినియోగదారులు, వాహనదారులు మాత్రం ప్రభుత్వం నిర్దేశించిన ఇసుక రీచ్‌లు, వినియోగదారుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత ఇసుక డంపింగ్ యార్డుల వద్ద నుంచి మాత్రమే ఇసుక పొందాలని సూచించారు. నిబంధనలు మీరి నదిలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేస్తే తెనాలి, ఇతర మండలాల గ్రామాలకు ఇసుక తరలించే వాహనాలను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అరవింద వారధి, చిలుమూరు వద్ద బృందాలతో పికెటింగ్ కూడా ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. పరిశీలనలో ఆయన వెంట డీటీ శ్రీనివాసరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.



చిలుమూరు వద్ద కృష్ణానదిలో ఇసుక అక్రమ తవ్వకాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సిబ్బంది

ఎమ్మెల్సీగా ఆలపాటిని గెలిపించుకుందాం

● మంత్రి మనోహర్



నామినేషన్‌కు వెళుతున్న ఆలపాటితో నాదెండ్ల మనోహర్ తదితరులు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఘన విజయంతో గెలిపించుకుందామని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. శుక్రవారం గుంటూరులో ఎమ్మెల్సీగా నామినేషన్ వేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ నామినేషన్ ర్యాలీ కార్యక్రమంలో మంత్రి మనోహర్ పాల్గొన్నారు. తెనాలి నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఆలపాటి నామినేషన్‌కు పెద్దసంఖ్యలో తరలివెళ్లి మద్దతు తెలిపారు.

నామినేషన్‌కు తరలివెళ్ళిన కొల్లిపర నాయకులు

కొల్లిపర, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరు కలెక్టరేట్ కార్యాలయంలో గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ శుక్రవారం వేసిన నామినేషన్ కార్యక్రమానికి కొల్లిపర మండలం నుంచి టీడీపీ నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్ళారు. ఈ సందర్భంగా దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, టీడీపీ నాయకులు ఆరిమండ రాధాకృష్ణారెడ్డి, గుదిబండి గోవర్ధనరెడ్డి, ఆరిమండ శివనాగమల్లేశ్వరరెడ్డి, చాగంటి నారాయణరెడ్డి, ఆరిమండ వెంకటరెడ్డి, షేక్ రఫీ, వల్లభాపురం బసవయ్య, విస్సారపు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



అనుమతులు లేని కట్టడాలను కూల్చివేస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

అనుమతులు లేని కట్టడాల కూల్చివేత

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం అనుమతులు లేని అక్రమ కట్టడాల కూల్చివేత కార్యక్రమాన్ని మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు చేపట్టారు. శుక్రవారం స్థానిక గంగానమ్మపేటలో పురపాలక సంఘం అనుమతులు లేకుండా నిర్మిస్తున్న నూతన భవనం అదనపు శ్లాబ్‌లను మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ సాంబశివరావు ఆధ్వర్యంలో మునిసిపల్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా టీపీవో సాంబశివరావు మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశాల మేరకు పురపాలక సంఘం అనుమతి ఇచ్చిన ప్లాన్ నిబంధలనకు విరుద్ధంగా నిర్మిస్తున్న అదనపు అంతస్థులను కూల్చివేస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ పురపాలక సంఘం నిబంధనలకు లోబడి నూతన భవన నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిరోధానికి కఠిన చర్యలు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిరోధానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని శ్రీరామ మునిసిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కాకుమాను లాజర్‌బాబు అన్నారు. శుక్రవారం ఆ పాఠశాలలో బాల్య వివాహ వ్యతిరేక ప్రచార ఉద్యమ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్ఏఎఫ్ సభ్యులు బాల్య వివాహాల వలన కలిగే నష్టాలు గురించి వివరించారు. బాల్య వివాహాలు చేసే వారిపై ప్రభుత్వం తీసుకునే చర్యలు, కోర్టులు విధించే శిక్షల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఆర్ఏఎఫ్ నిర్వాహకులు డి.అక్కయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చెత్త వేరు చేసే ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

గ్రామాలను చెత్తరహితంగా తీర్చిదిద్దాలి

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను చెత్తరహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈవోపీఆర్డీ కేఎస్ మల్లికార్జున రావు అన్నారు. మండల పరిధిలోని చింతలపూడిలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ నిర్వహణపై మండల పరిధిలోని గ్రామాల కార్యదర్శులకు శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పొడిచెత్త, తడి చెత్త విభజించే విధానం, ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి వాటిని రీసైక్లింగ్‌కు పంపించడం, తడి చెత్తను వర్మీ కంపోస్ట్‌గా తయారుచేయటంపై అవగాహన కల్పించారు. ప్రతి గ్రామంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్లను వినియోగంలోకి తీసుకువచ్చి గ్రామాల్లో చెత్త నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామాల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.